PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం – ప్రజల కోసం

తెలుగు దినపత్రిక




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 147, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 17 - జూలై - 2026 , వెల రూ.5/-

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

- గత పాలన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కేంద్రమే ఆదుకుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- నరసరావుపేటలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రుణాల పంపిణీ
- వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేత
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలోని అధిక వడ్డీ అప్పుల రీషెడ్యూల్ చేశామన్న సీఎం
- 2047 నాటికి ఏపీని హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దుతామని వెల్లడి




అమరావతి,: గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..




## ఓటర్ల జాబితా సవరణ : తెలంగాణలో 60 శాతం డిజటలైజేషన్ పూర్తి




## మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి: నరసరావుపేటలో నిర్మలా సీతారామన్

అమరావతి,: ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నేతలు అధికారంలోకి వచ్చాక దేశంలో పరిస్థితులు పూర్తిగా మారాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గతంలో ఫోన్ బ్యాంకింగ్ ద్వారా ఎవరికి రుణాలు ఇవ్వాలో నిర్దేశించే వారని, కానీ ఇప్పుడు బ్యాంకులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అర్హులైన వారికి అండగా నిలుస్తున్నాయని స్పష్టం

## భారత్‌లో సరికొత్త శకం.. తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

- హర్యానాలో తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలుకు పచ్చజెండా ఊపిన ప్రధాని
- జింద్-సోనిపట్ మధ్య పరుగులు పెట్టనున్న హైడ్రోజన్ రైలు
- హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శ్రీకారం
- ఢిల్లీ-కత్రా మధ్య ప్రయాణ సమయాన్ని 14 నుంచి 6 గంటలకు తగ్గించనున్న కొత్త ఎక్స్‌ప్రెస్‌వే
- కురుక్షేత్రలో ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, కొత్త మెడికల్ కాలేజీలను జాతికి అంకితం




ఢిల్లీ,: స్వచ్ఛ ఇంధన రవాణా రంగంలో భారతీయ రైల్వే చారిత్రక ముందడుగు వేసింది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది.

## అమెరికా దాడులతో విద్యుత్ సంక్షోభం.. ప్రజలకు ఇరాన్ ప్రభుత్వం కీలక సూచన




ఢిల్లీ,: అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, తమ దేశ విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరుగుతున్నట్లు ఇరాన్ తొలిసారిగా అంగీకరించింది. మరోవైపు, దేశంలోని దక్షిణ ప్రావిన్సులలో తీవ్రమైన వేడిగాలులు వీస్తుండటంతో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## మార్కెట్‌లో భారీ జోష్.. సెన్సెక్స్ 964 పాయింట్ల జంప్!




ఢిల్లీ,: ప్రైవేట్ బ్యాంకింగ్, ఐటీ, ఆటో షేర్లలో భారీ కొనుగోళ్లు నమోదవడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. ఉదయం నుంచి కొనుగోళ్ల జోరు కొనసాగడంతో సూచీలు రోజంతా గ్రీన్‌లోనే ట్రేడ్ అయ్యాయి. చివరకు సెన్సెక్స్ 964.58 పాయింట్లు ఎగబాకి 78,151.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 261.55 పాయింట్లు పెరిగి 24,334.30 వద్ద స్థిరపడింది.

## ఆధునిక హంగులతో ముస్తాబైన మంగళగిరి రైల్వే స్టేషన్... వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోదీ




అమరావతి,: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఉన్న చారిత్రక మంగళగిరి పట్టణానికి రైల్వే పరంగా కొత్త శోభ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద రూ.12.56 కోట్ల వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మంగళగిరి రైల్వే స్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

# తెలంగాణలో కేటీఆర్ పాదయాత్ర..

## బీఆర్ఎస్‌కు గేమ్ ఛేంజర్ అవుతుందా?

- కేటీఆర్‌కు అర్బన్ ఏరియాల్లో, యువతలో మంచి క్రేజ్ ఉంది
- ప్రజలతో మమేకం కావడం ద్వారా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపవచ్చు
- ఆరు గ్యారంటీల అమలులో జరుగుతున్న ఆలస్యం, లోపాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే కేటీఆర్ ప్రధాన లక్ష్యం




హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు సరికొత్త చర్చ నడుస్తోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చే ఏడాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ పాదయాత్రకు సిద్ధమవుతున్నారనే వార్తలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. వరుస ఎన్నికల ఓటములతో కొంత ఢీలా పడ్డ క్యాడర్‌లో జోష్ నింపడానికి పోగొట్టుకున్న ప్రజాదరణను తిరిగి దక్కించుకోవడానికి ఈ పాదయాత్రను ఒక బ్రహ్మాస్త్రంగా మలచాలని కేటీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ పాదయాత్ర బీఆర్ఎస్‌కు నిజంగానే 'గేమ్ ఛేంజర్' అవుతుందా? దీని వెనుక ఉన్న వ్యూహాలేంటి? తెలుసుకుందాం.

చారిత్రక వ్యూహాలపై అధ్యయనం

తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే పాదయాత్రలు ఎప్పుడూ అధికార పీఠాన్ని మార్చే శక్తివంతమైన సాధనాలుగా నిలిచాయి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన 'ప్రజాప్రస్థానం' కానీ.. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నిర్వహించిన 'వస్తున్నా మీకోసం'.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన 'ప్రజాసంకల్ప యాత్ర'.. తెలంగాణలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, వైఎస్ షర్మిల చేసిన పాదయాత్రలు.. ఇవన్నీ ప్రజాభిప్రాయాన్ని ఏ విధంగా ప్రభావితం చేశాయనే అంశాలపై కేటీఆర్ ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ఈ యాత్రల ప్లస్ లు, మైనస్ లను విశ్లేషిస్తూ తన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుంటున్నట్లు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

## వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు: కాకాణి గోవర్ధన్ రెడ్డి




తాను చెప్పే ఐదు మొక్కల పేర్లు చెప్పాలని లోకేశ్ కి సవాల్

పేర్లు చెబితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్

కూటమి ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపణ

## యూపీలో ప్రతిపక్షాల లక్ష్యం అరాచకమే.. వారు జిన్నా ఆరాధకులు: సీఎం యోగి ఆదిత్యనాథ్

- ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు జిన్నా ఆరాధకులంటూ సీఎం యోగి తీవ్ర వ్యాఖ్యలు
- షామ్లీలో రూ.581 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- 2017కు ముందు షామ్లీ ఉగ్రవాదానికి, వలసలకు కేంద్రంగా ఉండేదని విమర్శ
- డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో యూపీ స్వరూపమే మారిపోయిందని వ్యాఖ్య




ఢిల్లీ,: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రతిపక్షాలైన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీలను 'జిన్నా ఆరాధకులు' అంటూ ఘాటుగా విమర్శించారు. వారికి అవకాశం దొరికినప్పుడల్లా కులం, ప్రాంతం పేరుతో సమాజాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తారని ఆయన ఆరోపించారు. అరాచకాన్ని వ్యాప్తి చేయడం, మహిళలు, వ్యాపారుల భద్రతను బలహీనపరచడమే వారి ఏకైక లక్ష్యమని సీఎం యోగి దుయ్యబట్టారు.

## ఫలించిన వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ఉద్యమం




- పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఆమోదం
- ఎంపీ గురుమూర్తికి కేంద్ర వైద్యశాఖ సహాయ మంత్రి లేఖ

ఢిల్లీ: వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ఉద్యమం ఫలించింది. పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కమిషన్ ఆమోదం తెలిపింది. 2026-27 విద్యా సంవత్సరానికి లెటర్ ఆఫ్ పర్మిషన్ ఇచ్చినట్లు తిరుపతి ఎంపీ గురుమూర్తికి కేంద్ర వైద్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ లేఖ రాశారు. పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ సహా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ఉద్యమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన

## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్




- నేటి బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు హైకోర్టు అనుమతి
- శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ
- పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా నిర్వహించుకోవాలని స్పష్టమైన షరతులు
- ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్న కేటీఆర్



# అమెరికా దాడులతో విద్యుత్ సంక్షోభం.. ప్రజలకు ఇరాన్ ప్రభుత్వం కీలక సూచన

మొదటి పేజి తరువాయి

మరోవైపు, దేశంలోని దక్షిణ ప్రావిన్సులలో తీవ్రమైన వేడిగాలులు వీస్తుండటంతో విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఇరాన్ విద్యుత్ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దాడుల తీవ్రత అధికంగా ఉన్న దక్షిణ ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరాన్ ప్రభుత్వం సూచించింది. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరడం, మరోవైపు విద్యుత్ వ్యవస్థలే లక్ష్యంగా దాడులు జరుగుతుండటంతో ప్రజలు సాధ్యమైనంత వరకు విద్యుత్ ఆదా చేయాలని కోరింది. హర్మూజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం అమెరికా, ఇరాన్ మధ్య వివాదం ముదురుతున్న తరుణంలో, ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా వైమానిక దాడులను కొనసాగిస్తోంది. గతంలో ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ ప్లాంట్లపై దాడులు చేస్తామని అమెరికా హెచ్చరించిన విషయం తెలిసిందే. తాజాగా ఇరాన్‌లోని పలు లక్ష్యాలను ఛేదించినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ దాడుల్లో విద్యుత్ ప్లాంట్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు లేదా ఇతర వ్యవస్థలు ఎంతవరకు దెబ్బతిన్నాయనే వివరాలను మాత్రం ప్రభుత్వం వెల్లడించలేదు. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న దాడుల వల్ల విద్యుత్ నెట్‌వర్క్‌లోని దాదాపు 2,000కు పైగా ప్రాంతాల్లో నష్టం వాటిల్లిందని, వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని అధికారులు వెల్లడించారు. పాతబడిన వ్యవస్థలు, అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఆధునికీకరణకు నోచుకోకపోవడం, వేసవిలో పెరుగుతున్న డిమాండ్ వంటి కారణాలతో ఇరాన్ విద్యుత్ గ్రిడ్ ఇప్పటికే సంక్షోభంలో ఉంది. తాజా దాడులు ఈ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేశాయి. ఈ దాడుల కారణంగా ఇప్పటివరకు 38 మంది మరణించగా, 400 మందికి పైగా గాయపడ్డారని ఇరాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. చబహార్ పోర్టు సమీపంలో కూడా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ప్రస్తుతానికి దేశవ్యాప్తంగా అధికారికంగా విద్యుత్ కోతలు విధించనప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా దక్షిణ ప్రాంత ప్రజలు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# మార్కెట్‌లో భారీ జోష్.. సెన్సెక్స్ 964 పాయింట్ల జంప్!

మొదటి పేజి తరువాయి

నిఫ్టీ 261.55 పాయింట్లు పెరిగి 24,334.30 వద్ద స్థిరపడింది. మార్కెట్‌లో ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు రాణించాయి. నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీ 2.12 శాతం లాభపడింది. ఐటీ సూచీ 1.75 శాతం ఎగబాకింది. రియాల్టీ సూచీ 1.34 శాతం, ఆటో సూచీ 1.24 శాతం చొప్పున పెరిగాయి. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల షేర్లు మాత్రం ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. నిఫ్టీ-50 సూచీలో టెక్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు అత్యధికంగా లాభపడ్డ వాటిలో ఉన్నాయి. హిండాల్కో, డాక్టర్ రెడ్డీస్, విప్రో, సన్ ఫార్మా, అపోలో హాస్పిటల్స్ షేర్లు నష్టపోయాయి. ఏఐ కంపెనీల అధిక విలువలు, పశ్చిమాసియా భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచ మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగుతున్నా.. దేశీయ మార్కెట్ సెంటిమెంట్ నిలకడగా ఉందని నిపుణులు తెలిపారు. తొలి త్రైమాసిక ఫలితాలపై నెలకొన్న అంచనాలు, కంపెనీల వ్యాపార అప్‌డేట్లు కూడా కొనుగోళ్లకు ఊతమిచ్చాయని విశ్లేషించారు. సాంకేతికంగా చూస్తే నిఫ్టీకి 24,400 స్థాయి కీలక నిరోధంగా ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ స్థాయిని దాటితే సూచీ 24,500 నుంచి 24,600 స్థాయుల దిశగా కదిలే అవకాశం ఉందని అంచనా వేశారు. మరోవైపు 24,200 తక్షణ మద్దతుగా మారిందని, ఆ తర్వాత 24,000 స్థాయి కీలక సపోర్ట్‌గా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## ఆధునిక హంగులతో ముస్తాబైన మంగళగిరి రైల్వే స్టేషన్... వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి

మంగళగిరి రైల్వే స్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. గుంటూరు డివిజన్ పరిధిలోని ఈ స్టేషన్‌లో ప్రయాణికులకు ప్రపంచస్థాయి అనుభూతిని అందించడమే లక్ష్యంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. ఆధునికీకరణలో భాగంగా స్టేషన్ ముఖద్వారాన్ని ఆకర్షణీయంగా మార్చడంతో పాటు, ప్రయాణికుల కోసం మెరుగైన వెయిటింగ్ హాల్స్ నిర్మించారు. ప్రయాణికులకు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా యాక్సెసిబిలిటీ ఫీచర్లను మెరుగుపరిచారు. ముఖ్యంగా, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణించేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం గమనార్హం. ఈ ఆధునిక సౌకర్యాలు ప్రయాణ అనుభవాన్ని మరింత సౌకర్యవంతంగా, సురక్షితంగా మారుస్తాయని అధికారులు తెలిపారు. దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని, సమగ్ర సౌకర్యాలతో ఈ స్టేషన్‌ను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా రైలు, రోడ్డు కనెక్టివిటీని బలోపేతం చేసే బృహత్తర ప్రణాళికలో భాగం. ప్రధాని మోదీ ఒకే రోజు రూ.5,470 కోట్లకు పైగా విలువైన పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా, రూ.1,570 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన 75 రైల్వే స్టేషన్లను జాతికి అంకితం చేశారు. 'వారసత్వం, అభివృద్ధి' (విరాసత్ భీ, వికాస్ భీ) స్ఫూర్తితో స్థానిక సంస్కృతి, చారిత్రక నేపథ్యం ఉట్టిపడేలా ఈ స్టేషన్లను తీర్చిదిద్దారు. మంగళగిరి స్టేషన్‌తో పాటు, పంజాబ్‌లోని జలంధర్ కంటోన్మెంట్ వంటి అనేక స్టేషన్లు ఈ జాబితాలో ఉన్నాయి. రైల్వే ప్రాజెక్టులతో పాటు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ మధ్య కనెక్టివిటీని పెంచేందుకు రూ.830 కోట్లతో నిర్మించిన దౌలత్‌పూర్ చౌక్-కటోలీ కొత్త రైలు మార్గాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. దీంతో పాటు కటోలీ-అంబాలా, అమృత్‌సర్-వారణాసి మధ్య కొత్త రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు. ఈ మార్గాలు శ్రీ ఆనంద్‌పూర్ సాహిబ్, మా చింతపూర్ణి ఆలయం వంటి పుణ్యక్షేత్రాలకు ప్రయాణాన్ని సులభతరం చేస్తాయి. పంజాబ్‌లో రూ.3,070 కోట్లకు పైగా విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు కూడా శ్రీకారం చుట్టారు. దేశ ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయడం, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యమని ప్రధాని కార్యాలయం వెల్లడించింది. ఈ కార్యక్రమానికి ముందు ప్రధాని డేరా సచ్‌ఖండ్ అధిపతి సంత్ నిరంజన్ దాస్‌తో సమావేశమై ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

## మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి - నరసరావుపేటలో నిర్మలా సీతారామన్

మొదటి పేజి తరువాయి

కానీ ఇప్పుడు బ్యాంకులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అర్హులైన వారికి అండగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన 'క్రెడిట్ అవుట్‌రీచ్' కార్యక్రమంలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, బ్యాంకులు ప్రజల వద్దకు వెళ్లి సేవలు అందించాలన్నది ప్రధాని మోదీ ఆలోచన అని తెలిపారు. 2004 నుంచి 2014 మధ్య కేంద్రంలో ఉన్న ప్రభుత్వం, ఫోన్ కాల్స్ ద్వారా తమకు కావాల్సిన వారికి రుణాలు ఇప్పించుకునేదని, కానీ ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ఆ విధానానికి స్వస్తి పలికిందని వివరించారు. ప్రస్తుతం గ్రామగ్రామాన బ్యాంకులు పర్యటించి, ఎలాంటి హామీ లేకుండా అర్హత ఉన్నవారికి రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. వీధి వ్యాపారులకు సైతం ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి వారి వ్యాపారాలకు చేయూతనిస్తోందని వివరించారు. అధిక వడ్డీలకు అప్పులిచ్చే వ్యాపారుల బారిన పడకుండా మైక్రో ఫైనాన్స్ ద్వారా మహిళలు, చిరు వ్యాపారులను ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు. దేశవ్యాప్తంగా బ్యాంకులు తమ పనితీరును, ప్రజలు బ్యాంకుల పట్ల తమ దృక్పథాన్ని మార్చుకున్నారని, నరసరావుపేటలో జరిగిన ఈ రుణమేళా దీనికి నిదర్శనమని అన్నారు. వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కోట్లాది రూపాయల రుణాన్ని బ్యాంకులు అందించడానికి తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అగ్రగామి అభివృద్ధి చెందిన దేశంగా, 'వికసిత్ భారత్'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆమె పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చిన అంబులెన్స్‌లను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాలికలకు సైకిళ్లను పంపిణీ చేసి, వివిధ రంగాలకు చెందిన లబ్ధిదారులకు రుణాలను వితరణ చేశారు.

## ఓటర్ల జాబితా సవరణ : తెలంగాణలో 60 శాతం డిజిటలైజేషన్ పూర్తి




హైదరాబాద్, : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఇప్పటివరకు 60 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం మేర పురోగతి సాధించిందని ఆయన తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని సుల్తాన్‌పూర్, ఐలాపూర్, పటాన్‌చెరు ప్రాంతాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ క్యాంపులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సవరణ ప్రక్రియ జరుగుతున్న తీరును బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. శిబిరాల వద్ద ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ మాట్లాడారు. వారికి పార్టీలు తరఫున గుర్తింపు కార్డులు జారీ అయ్యాయా అన్న అంశంపై ఆరా తీశారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు, బీఎల్ఓల సమన్వయంతో ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. పొడిగించిన గడువును దృష్టిలో ఉంచుకుని సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని పక్షంలో, వాటిని వెంటనే సూపర్ వైజర్ల నుంచి సేకరించాలని ఆయన ఆదేశించారు.

# భారత్‌లో సరికొత్త శకం.. తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి




పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ రైలు, తన ప్రయాణానికి అవసరమైన విద్యుత్‌ను హైడ్రోజన్‌ను ఉపయోగించి స్వయంగా ఉత్పత్తి చేసుకుంటుంది. కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుంది. ఈ 10 కోచ్‌ల రైలు హర్యానాలోని జింద్, సోనిపట్ మధ్య 90 కిలోమీటర్ల దూరాన్ని కేవలం రెండు గంటల్లో పూర్తి చేస్తుంది. 3,200 హార్స్‌పవర్ సామర్థ్యంతో పనిచేసే ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. ఈ ఘనతతో హైడ్రోజన్ రైళ్లను నడుపుతున్న అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది.

రూ.12,470 కోట్లతో రహదారుల అభివృద్ధి

ఈ కార్యక్రమంతో పాటు హర్యానాలో రూ.12,470 కోట్లకు పైగా విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేసి, మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సుమారు రూ.9,680 కోట్ల వ్యయంతో నిర్మించిన 158 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-అమృత్‌సర్-కత్రా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ వల్ల ఢిల్లీ-కత్రా ప్రయాణ సమయం 14 గంటల నుంచి 6 గంటలకు, ఢిల్లీ-అమృత్‌సర్ ప్రయాణ సమయం 8 నుంచి 4 గంటలకు తగ్గనుంది. ఇది వైష్ణోదేవి యాత్రికులకు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అదేవిధంగా అంబాలా-కాలా అంబ్, జింద్-గోహానా జాతీయ రహదారులను కూడా జాతికి అంకితం చేశారు. జింద్-గోహానా రహదారి వల్ల ప్రయాణ సమయం రెండు గంటల నుంచి 40 నిమిషాలకు తగ్గనుంది. హన్సీ-బరవాలా రహదారి విస్తరణ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

వైద్యం, మౌలిక సదుపాయాలకు పెద్దపీట

కురుక్షేత్ర నగరంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిర్మించిన ఎలివేటెడ్ రైల్వే ట్రాక్‌ను కూడా ప్రధాని ప్రారంభించారు. ఇది రైలు, రోడ్డు రవాణా వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచుతుంది. రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భివానీలోని పండిట్ నేకీ రామ్ శర్మ ప్రభుత్వ వైద్య కళాశాల, నార్నౌల్‌లోని మహర్షి చ్యవన్ మెడికల్ కాలేజీ, రావు తులారామ్ ఆసుపత్రిని జాతికి అంకితం చేశారు. ఈ సంస్థల ద్వారా హర్యానాలో వైద్య విద్య, ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు సిక్కు గురువుల చరిత్ర, వారి త్యాగాలు, దేశ సంస్కృతికి వారు అందించిన సేవలను ఆధునిక టెక్నాలజీతో ప్రదర్శించేందుకు కురుక్షేత్రలో నిర్మించనున్న సిక్కు మ్యూజియానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ హర్యానా సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

## యూపీలో ప్రతిపక్షాల లక్ష్యం అరాచకమే.. వారు జిన్నా ఆరాధకులు: సీఎం యోగి ఆదిత్యనాథ్

మొదటి పేజి తరువాయి

అరాచకాన్ని వ్యాప్తి చేయడం, మహిళలు, వ్యాపారుల భద్రతను బలహీనపరచడమే వారి ఏకైక లక్ష్యమని సీఎం యోగి దుయ్యబట్టారు. షామ్లీ జిల్లాలో రూ.581 కోట్ల విలువైన 89 అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 2017కు ముందు, ఆ తర్వాత పరిస్థితులను పోల్చి చూస్తూ సీఎం యోగి మాట్లాడారు. ఒకప్పుడు షామ్లీ జిల్లా ఉగ్రవాదానికి, సామూహిక వలసలకు, గూండాయిజానికి కేంద్రంగా ఉండేదని, కానీ నేడు తమ ప్రభుత్వం హయాంలో అభివృద్ధికి చిరునామాగా మారిందని ఆయన అన్నారు. "2017కు ముందు ఇక్కడ అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. విద్యుత్, భద్రత, వైద్యం వంటి కనీస సౌకర్యాలు దయనీయంగా ఉండేవి. గూండాలు, పోకిరీలు వీధుల్లో బహిరంగంగా తిరిగేవారు. ఆడపిల్లలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడే పరిస్థితి. రైతులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి నెలకొని ఉండేది. కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవన్నీ గత చరిత్రగా మిగిలిపోయాయి. యూపీ ముఖచిత్రం, తలరాత పూర్తిగా మారిపోయింది" అని యోగి వివరించారు. ఢిల్లీ-డెహ్రాడూన్, షామ్లీ-అంబాలా, ప్రతిపాదిత షామ్లీ-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంతో భవిష్యత్తులో ఈ జిల్లా పశ్చిమ ఉత్తరప్రదేశ్‌తో పాటు ఎన్‌సీఆర్‌లో కీలకమైన అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంలో యూపీలో జరిగిన పరివర్తన గురించి మాట్లాడుతూ.. ప్రస్తుతం చెరకు, చక్కెర, ఇథనాల్ ఉత్పత్తిలో దేశంలోనే ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 2017లో రాష్ట్రంలోని చక్కెర మిల్లులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయని, కానీ బీజేపీ ప్రభుత్వం వాటిని విజయవంతంగా గట్టెక్కించిందని యోగి గుర్తుచేశారు. ప్రస్తుతం 122 చక్కెర మిల్లులు పనిచేస్తున్నాయని, చెరకు రైతులకు క్వింటాల్‌కు రూ.400 ధర అందుతోందని, చెల్లింపుల వ్యవస్థ కూడా గతంతో పోలిస్తే ఎంతో మెరుగుపడిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 1857 సిపాయిల తిరుగుబాటులో షామ్లీ, కైరానాల చారిత్రక పాత్రను, భారత శాస్త్రీయ సంగీతానికి ఈ ప్రాంతం అందించిన సేవలను సీఎం యోగి స్మరించుకున్నారు.

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

మొదటి పేజి తరువాయి

అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కేటీఆర్ పాదయాత్ర.. బీఆర్ఎస్‌కు గేమ్ ఛేంజర్ అవుతుందా?

మొదటి పేజి తరువాయి

ప్రధాన ఎజెండా.. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో జరుగుతున్న ఆలస్యం, లోపాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే కేటీఆర్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రైతాంగ సమస్యలను ఫోకస్ చేయనున్నారు. రుణమాఫీ సగం మందికే కావడం, రైతుబంధు/రైతుభరోసా నిధుల విడుదలపై క్షేత్రస్థాయిలో అసంతృప్తిని క్యాష్ చేసుకోవడం. జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నియామకాలపై యువతలో ఉన్న అసహనాన్ని బీఆర్ఎస్ వైపు తిప్పుకోవడం... ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యాలు, గ్రామీణాభివృద్ధి కుంటుపడటం వంటి అంశాలను ప్రధాన ఎజెండాగా మార్చుకోనున్నారు.

పార్టీ క్యాడర్‌కు కొత్త ఊపు

బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు నాయకులు ప్రజలకు కొంత దూరమయ్యారనే విమర్శ ఉంది. ఇప్పుడు నేరుగా ప్రజల వద్దకు వెళ్లడం ద్వారా ఆ దూరాన్ని తగ్గించుకోవాలని కేటీఆర్ యోచిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో స్థానిక సమస్యలను తెలుసుకుంటూ.. ప్రజలతో మమేకం కావడం ద్వారా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపవచ్చు. నిరంతరం ప్రజల్లో ఉండే నాయకుడికి క్యాడర్ ఎప్పుడూ అండగా ఉంటుందనే నమ్మకం బీఆర్ఎస్ నాయకత్వంలో వ్యక్తమవుతోంది.

గేమ్ ఛేంజర్ అవుతుందా?

కేటీఆర్‌కు అర్బన్ ఏరియాల్లో, యువతలో మంచి క్రేజ్ ఉంది. కానీ ఈ పాదయాత్ర ద్వారా ఆయన గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, మహిళలు, అట్టడుగు వర్గాలకు ఎంతవరకు కనెక్ట్ కాగలరనే దానిపైనే బీఆర్ఎస్ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఇప్పటివరకు కేటీఆర్ ఎక్కువగా హైటెక్, డెవలప్‌మెంట్, ఐటీ లీడర్‌గా ముద్రపడ్డారు. ఈ పాదయాత్ర ఆయనను సంపూర్ణంగా ప్రజా నాయకుడిగా మార్చే అవకాశం ఉంది. ఒకవేళ ఈ యాత్ర అనుకున్నట్లుగా సాగి.. ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తే మాత్రం.. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని మార్చేసి, బీఆర్ఎస్‌కు ఇది ఖచ్చితంగా పెద్ద 'గేమ్ ఛేంజర్' అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే షెడ్యూల్ , రూట్ మ్యాప్ ఖరారైన తర్వాతే దీనిపై మరింత స్పష్టత రానుంది.

## బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సభ'కు షరతులతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్




హైదరాబాద్, : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శనివారం హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, బీఆర్ఎస్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించింది. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సభ నిర్వహించాలని స్పష్టం చేస్తూ అనుమతించింది. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ సభను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రియాంక గాంధీ ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' అమలు, నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జాప్యం వంటి అంశాలను ఈ సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. కోర్టులో విచారణ సందర్భంగా, ఇంటెలిజెన్స్ నివేదికల ప్రకారం శాంతిభద్రతల సమస్యలు తలెత్తవచ్చని, పార్కింగ్ సౌకర్యం కూడా సరిగా లేదని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, 17 రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా ఎందుకు నిర్ణయం తీసుకోలేదని అధికారులను ప్రశ్నించింది. చివరికు, రోడ్లను దిగ్బంధించడం లేదా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా సభను శాంతియుతంగా నిర్వహించాలని బీఆర్ఎస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు: కాకాణి గోవర్ధన్ రెడ్డి

అమరావతి,: కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేశ్ పై మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదని ఆయన ఎద్దేవా చేశారు. అంతేకాదు తాను చూపించే ఏవైనా ఐదు వ్యవసాయ మొక్కల పేర్లను ఆయన సరిగ్గా చెబితే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని కాకాణి సవాల్ విసిరారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం దోపిడీయే పరమావధిగా పాలిస్తోందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూరితే, ప్రస్తుతం చంద్రబాబు వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని కాకాణి దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో నిర్మించిన రామాయపట్నం పోర్టును ఈ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమే ఇందుకు నిదర్శనమని కాకాణి విమర్శించారు. ఈ ప్రభుత్వంలో గ్రావెల్ తవ్వకాల నుంచి నిరుద్యోగుల డీఎస్సీ నోటిఫికేషన్ వరకు ప్రతి ఒక్క విషయంలోనూ అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ప్రతి పథకంలోనూ, ప్రభుత్వ నిర్ణయంలోనూ పారదర్శకత లోపించిందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతిని ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వ్యవసాయ రంగం, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై కాకాణి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి.

## ఫలించిన వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ఉద్యమం

మొదటి పేజి తరువాయి

పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ సహా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ఉద్యమం చేపట్టిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలన్న అంశంపై వైఎస్సార్‌సీపీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి గత పార్లమెంటు సమావేశాలలో ప్రస్తావించారు. ఇందుకు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ ఎంపీ గురుమూర్తికి లేఖ ద్వారా సమాధానం పంపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీ గురుమూర్తి 2025 డిసెంబర్ 12న కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో పాటు, లోక్‌సభలో రూల్-377 కింద ఈ అంశాన్ని ప్రస్తావించారు. దీనిపై జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ)తో సంప్రదించి అంశాన్ని పరిశీలించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 39 మెడికల్ కళాశాలలు ఉన్నాయని, వాటిలో 19 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, 20 ప్రైవేట్ మెడికల్ కళాశాలలు ఉన్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో మొత్తం 7,215 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, అందులో ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 3,415, ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో 3,800 సీట్లు ఉన్నట్లు వెల్లడించింది. అదేవిధంగా, 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 100 ఎంబీబీఎస్ సీట్లు, చిత్తూరులోని ఆర్వీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు 150 ఎంబీబీఎస్ సీట్లతో అనుమతి జారీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తన లేఖలో స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య విద్యాభివృద్ధి, ప్రభుత్వ వైద్య కళాశాలల బలోపేతం, వైద్య విద్య అవకాశాల విస్తరణకు సంబంధించిన అంశాలను పార్లమెంట్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలకు 100 ఎంబీబీఎస్ సీట్లు కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి పేద విద్యార్థులకు వైద్య విద్యతోపాటు, మెరుగైన వైద్యం అందించాలన్న తమ నాయకుడు వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా ప్రజా ప్రయోజన అంశాలపై భవిష్యత్తులో కూడా ఇదే విధంగా నిరంతరం కృషి కొనసాగిస్తానని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు.

# ఇప్పుడు అలా కుదరదు.. స్థానిక ఎన్నికలపై నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు!

అమరావతి,: ఏపీలో సార్వత్రిక ఎన్నికల వేడి చల్లారకముందే స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు స్థానిక ఎన్నికలపై పలు సందర్భాల్లో సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో, సెప్టెంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న ప్రచారంతో ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో వ్యూహరచనకు పదును పెడుతున్నాయి. ఈ క్రమంలో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలోనూ స్థానిక ఎన్నికల పొత్తులు, సీట్ల పంపకాలపై చర్చ ఊపందుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన ఫార్ములా స్థానిక ఎన్నికలకు వర్తించదని, పార్టీ బలాబలాల ఆధారంగానే పోటీ ఉంటుందని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే 2024 సార్వత్రిక ఎన్నికల్లో తమ అధినేత పవన్ కల్యాణ్ పొత్తు నిర్ణయం తీసుకున్నారని మనోహర్ గుర్తుచేశారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా, వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే లక్ష్యంతో జనసేన కొన్ని సీట్లలో సర్దుకుపోయిందని, నాలుగు అడుగులు వెనక్కి తగ్గిందని అన్నారు. అయితే, ఆ త్యాగాన్ని స్థానిక ఎన్నికల్లోనూ ఆశిస్తే పొరపాటేనని ఆయన స్పష్టం చేశారు. "సార్వత్రిక ఎన్నికల ఫార్ములానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఉంటుందనడం సరికాదు. స్థానిక పరిస్థితులు, పార్టీ బలం ఆధారంగానే మా పోటీ ఉంటుంది. పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే, జనసేన బలంగా ఉన్నచోట కచ్చితంగా పోటీ చేస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. త్వరలో జరగబోయే ఎన్డీయే కూటమి సమావేశంలో ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పార్టీ బలోపేతం, కార్యకర్తలకు అవకాశాలు కల్పించడంపై కూడా జనసేన దృష్టి సారించింది. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి స్థానిక ఎన్నికల్లో తప్పకుండా అవకాశం కల్పిస్తామని మనోహర్ భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే జనసైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు 'జనసేన పార్టీ చర్చావేదిక' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిని రాష్ట్రంలో తొలిసారిగా కైకలూరు నుంచి మొదలుపెట్టినట్లు ఆయన ప్రకటించారు. ఈ వేదిక ద్వారా గ్రామస్థాయిలో కార్యకర్తల ఇబ్బందులను తెలుసుకోవడంతో పాటు వైసీపీ సోషల్ మీడియా ద్వారా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొడతామని వివరించారు. కూటమిగా కలిసి పనిచేస్తున్నప్పుడు చిన్న చిన్న సమస్యలు, అభిప్రాయభేదాలు సహజమని, వాటిని సర్దుకుని ముందుకు సాగాలని జనసైనికులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ విధ్వంసం సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమిలోని అన్ని పార్టీల శ్రేణులు అంకితభావంతో కలిసికట్టుగా పనిచేసి, ప్రభుత్వానికి అండగా నిలవాలని మనోహర్ సూచించారు. మొత్తం మీద స్థానిక ఎన్నికల్లో జనసేన మరింత కీలక పాత్ర పోషించాలని భావిస్తోందని, సీట్ల పంపకాల్లో గట్టిగా బేరమాడేందుకు సిద్ధమవుతోందని మనోహర్ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన రఘురామ



అమరావతి,: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ భుజానికి శస్త్రచికిత్స అనంతరం ప్రస్తుతం హైదరాబాదులో విశ్రాంతి తీసుకుంటున్నారు. శుక్రవారం సాయంత్రం పలువురు పార్టీ నేతలు, ప్రముఖులు ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన వారిలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జనసేన పార్టీ విప్ బొమ్మిడి నాయకర్, ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, గిడ్డి సత్యనారాయణ, అరవ శ్రీధర్ సహా పలువురు సినీ నిర్మాతలు, న్యాయవాదులు ఉన్నారు. ఆయన వేగంగా కోలుకుంటుండటం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ, త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలోకి రావాలని ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ కుడి భుజానికి తీవ్ర గాయం కావడంతో జూలై 11న ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగిన విషయం విదితమే. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దిన్షా పర్దివాలా నేతృత్వంలో సుమారు మూడున్నర గంటల పాటు 'ఆర్త్రోస్కోపిక్ రిపేర్ సర్జరీ' విజయవంతంగా పూర్తయింది. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని జనసేన పార్టీ వర్గాలు వెల్లడించాయి. పవన్ కల్యాణ్ సంపూర్ణంగా కోలుకుని, భుజం పనితీరు సాధారణ స్థితికి రావడానికి సుమారు నాలుగు నెలల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం తీసుకుంటున్న విశ్రాంతి, నొప్పి తీవ్రతను పరిగణనలోకి తీసుకుని, మరో రెండు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా శస్త్రచికిత్స నిర్వహించనున్నారు. 2016 నుంచి బాధిస్తున్న పాత గాయం, సినిమా షూటింగులు మరియు రాజకీయ ప్రచారాల కారణంగా మరింత తీవ్రం కావడంతో వైద్యులు శస్త్రచికిత్సను అనివార్యమని సూచించారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
జనరల్ న్యూస్
శనివారం -18- జులై - 2026

## మన వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వద్దు

- ఒప్పందంపై సంతకం చేయవద్దు అంటూ 22న జిల్లా వ్యాప్తంగా నిరసనలు

- రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపు




ఏలూరు, నేటి శుభోదయ ::: మన రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసి నాశనం చేసే అమెరికాతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయవద్దు అంటూ ఈనెల 22న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపునిచ్చింది. శుక్రవారం ఏలూరు,అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం బి కే ఎం యు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన రావు, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి కారం రాఘవ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస డాంగే తదితరులు మాట్లాడారు. అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసేందుకు కేంద్ర మోడీ ప్రభుత్వం తహతహలాడుతోందని, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే ఈ ఒప్పందం అని విమర్శించారు. అమెరికా నుండి ఎటువంటి సుంకాలు లేకుండా పాలు,పాలు పదార్థాలు, కోడి మాంసం, మొక్కజొన్నలు, పత్తి, సోయాబీన్, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయ్యి దేశీయంగా రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజల స్వయం సమృద్ధిని, సార్వభౌమాధికారాన్ని నాశనం చేసి ప్రపంచ కార్పొరేట్ సంస్థలకు, అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ ప్రభుత్వం లొంగిపోయి వ్యవహరించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇప్పటికే దేశంలో రైతులు వ్యవసాయ సంక్షోభంలో కూరుకుపోయి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు పెట్టవద్దని డిమాండ్ చేశారు. సంతకం చేస్తే ఎఫ్ టి ఏ కు వ్యతిరేకంగా మరో చారిత్రాత్మక రైతు ఉద్యమానికి సమాయత్తం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈనెల 22న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ వ్యతిరేకంగా జరుగుతున్న నిరసన కార్యక్రమాలలో సంయుక్త కిసాన్ మోర్చాలోని భాగస్వామ్య సంఘాలతో పాటు జిల్లాలోని అన్ని పంటల రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు,కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. 22వ తేదీ లోపు రాష్ట్రపతికి వినత పత్రాలు పంపాలని, 22న మండల,జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం నిర్ణయించింది.

## 'నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణం చేపట్టాలి.'

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస - శ్యామలాంబ మున్సిపల్ హైస్కూల్ అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు పరిశీలన..



రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా చేపడుతున్న నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వివెల్ పురం శ్యామలాంబ మున్సిపల్ హైస్కూల్ లో విద్యార్థుల సంఖ్య పెరగడం అలాగే 6, 7, 8, 9, 10 తరగతుల విద్యార్థుల కోసం నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను శుక్రవారం ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా నాణ్యతను కచ్చితంగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇటీవల ఈ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో గతంలో 8వ తరగతి వరకు మాత్రమే ఉన్న బోధన ప్రస్తుతం 9వ, 10వ తరగతులకు కూడా విస్తరించిందన్నారు. అయితే విద్యార్థుల సంఖ్య పెరగడంతో తగినంత తరగతి గదులు లేక విద్యార్థులు ఇరుకైన గదుల్లో చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా సుమారు రూ.80 లక్షల వ్యయంతో పబ్లిక్ పార్టిసిపేషన్ (సీఎస్ఆర్ సహకారం) ద్వారా కొత్త తరగతి గదుల నిర్మాణాన్ని చేపట్టామని వివరించారు. తొలి దశలో నాలుగు విశాలమైన క్లాస్‌రూమ్‌లను నిర్మిస్తుండగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మరింత విస్తరణకు అవకాశం ఉండేలా ప్రణాళిక రూపొందించారని తెలిపారు. కాగా నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. డివిజన్ ఇంచార్జ్ కంటిపూడి రాజేంద్రప్రసాద్, అడబాల రాజా, ఇంజనీర్ మాణిక్యాలరావు, కూర్పు రామారావు, ఐకే శ్రీను తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

## పుష్కరాల ఏర్పాట్లు, మౌలిక వసతుల కల్పనపై ప్రజాప్రతినిధుల సమీక్ష..రుడా కీలక సమావేశం..

- రాజానగరం నియోజకవర్గంలో చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతిపాదనలు, జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్షలు...



కొరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రాజమండ్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో రాజమండ్రి మున్సిపల్ కార్యాలయంలో 8వ బోర్డు సమావేశం అత్యంత కీలక అంశాలతో నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, మరియు జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్ పాల్గొని, ప్రాంతీయ అభివృద్ధిపై దిశా నిర్దేశం చేశారు. 2027లో జరగనున్న ప్రతిష్టాత్మక గోదావరి పుష్కరాలకు సంబంధించి, రాజమండ్రి నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భారీ ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శాశ్వత మౌలిక వసతులు, ట్రాఫిక్ నియంత్రణ మరియు ఘాట్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ.. తన నియోజకవర్గ పరిధిలోని మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక ప్రతిపాదనలు చేశారు. రాజానగరం నియోజకవర్గం వేగంగా పట్టణీకరణ చెందుతున్న నేపథ్యంలో, రాబోయే కాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెరుగైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మరియు విద్యుత్ వసతులపై రుడా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని పల్లెలు, పట్టణాలను అనుసంధానిస్తూ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రాజానగరం నియోజకవర్గ అభివృద్ధికి రుడా ద్వారా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అత్యున్నత స్థాయి ప్రణాళికలను అమలు చేస్తున్నాం. 2027 పుష్కరాల దృష్ట్యా మన ప్రాంతానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు మరియు స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని రకాల ఏర్పాట్లు అత్యంత నాణ్యతతో పూర్తి చేస్తాము. మన నియోజకవర్గాన్ని ఒక ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం..అని తెలిపారు. ఈ సమావేశంలో రుడా అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది మరియు ఇతర సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్జ్ లో మొక్కలు నాటిన చిట్టి చేతులు

-- నేడు చెట్టు నాటుదాం

రేపటి కోసం పచ్చని భవిష్యత్తుని నిర్మిద్దాం



ఖమ్మం, నేటి శుభోదయ ::: స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆవరణం శుక్రవారం చిట్టి చేతుల వన మహోత్సవ సంబరంలో మురిసిపోయింది. చిన్నారులు వనమహోత్సవ వేడుకను ఆనందోత్సవాలతో నిర్వహించారు. పాఠశాల చిన్నారులు పాఠశాల మైదానంలో, రహదారులకు ఇరువైపులా పలు రకాల మొక్కలను నాటారు. నీడనిచ్చే మొక్కలు, పండ్ల మొక్కలు, అందంగా పూలతో ఉండే మొక్కలు, తదితర వివిధ రకాల మొక్కలను నగరంలోని వేరువేరు ప్రాంతాలలో నాటారు. మొక్కలతో నగరంలో పాఠశాల విద్యార్థులు వనమహోత్సవ చైతన్య ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన విద్యార్థులు ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారుల గుండా నిర్వహించి ప్రజలను వనమహోత్సవం గురించి చైతన్యపరిచారు. పాఠశాలలో మొక్కల ప్రయోజనాలను వివరిస్తూ ఇద్దరు విద్యార్థులు ప్రదర్శించిన లఘు నాటిక అందరిని ఆలోచింపజేసింది. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య వనమహోత్సవ ర్యాలీని ప్రారంభించగా ఖమ్మం కార్పొరేషన్ హార్టికల్చర్ అధికారిని రాధిక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ హార్టికల్చర్ అధికారిని రాధిక మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సంకల్పంతో నిర్వహించాలని కోరారు. మొక్కలు పెంచడం ద్వారా మనకు దీర్ఘకాలంగా ప్రాణవాయువు లభిస్తుందని పేర్కొన్నారు. స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు వనమహోత్సవాన్ని వేడుకోగా




నిర్వహించడం ద్వారా ఇతర పాఠశాలల విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం సామాజిక బాధ్యతతో నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలోని పెరిగిన చెట్లు తమ పాఠశాల విద్యార్థులు గతంలో నాటిన మొక్కల వల్లనే ప్రయోజనం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి ముందు తమ పుట్టినరోజున తప్పనిసరిగా మొక్కలు నాటి పెంచాలని కోరారు. అనంతరం విద్యార్థులందరికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## "భీమవరం, పాలకొల్లులలో ఈట్ స్ట్రీట్ లను ఏర్పాటు చేస్తాం

తాడేపల్లిగూడెం ఈట్ స్ట్రీట్‌లో ప్రజల మధ్య అల్పాహారం స్వీకరించిన కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ"



తాడేపల్లిగూడెం జులై 17 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::త్వరలో భీమవరం పాలకొల్లు లలో ఈట్ స్ట్రీట్ లను ఏర్పాటు చేయటానికి కృషి చేస్తాను అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ తన నిరాడంబరతను మరోసారి చాటుకున్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రముఖ ఫుడ్ కోర్ట్ 'ఈట్ స్ట్రీట్' వద్ద ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సామాన్య ప్రజల మధ్య కూర్చుని ఆయన అల్పాహారం స్వీకరించి, టీ తాగారు. కేంద్రమంత్రి తమ మధ్యకు రావడం తోపాటు తమతో మమేకమై మాట్లాడటంతో స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. బిజెపి ఆధ్వర్యంలో జరిగిన పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్రలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. ఆ కార్యక్రమం ముగించుకుని తిరిగి భీమవరం వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో తాడేపల్లిగూడెంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా స్థానిక ఈట్ స్ట్రీట్‌లో తోటి నాయకులతో కలిసి ఆయన సందడి చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, సీనియర్ బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ తదితర స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

## వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తల అనుసంధాన వేదికే 'జగన్ 2.0 సూపర్ యాప్'

జగన్ 2.0 సూపర్ యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకోండి..

పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి...

పార్టీ శ్రేణులతో కలసి జగన్ 2.0 సూపర్ యాప్ ను ఆవిష్కరణ..




అనంతపురం బ్యూరో జులై 17 శుభోదయ :వైయస్సార్ సీపీ నాయకత్వానికి, కార్యకర్తలకు మధ్య అనుసంధాన వేదికనే "జగన్ 2.0 సూపర్ యాప్" అని అనంతపురం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురము లోని హెచ్ ఎల్ సి కాలనీలో ఉన్న వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నందు జగన్ 2.0 సూపర్ యాప్ ను పార్టీ శ్రేణులతో కలసి పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వైయస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తూ అణచివేసే ధోరణిలో వ్యవహరిస్తోందన్నారు. కూటమి కుట్రలను తిప్పికొడుతూ వైయస్సార్ సీపీ కార్యకర్తలకు, నాయకులకు మధ్య అనుసంధానంగా ఉండాలనే సదుద్దేశంతో "జగన్ 2.0 సూపర్ యాప్" ఏర్పాటు చేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వం చేస్తున్న దురాగతాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ జగన్ 2.0 సూపర్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## వీర్లంకపల్లి, పెంటపల్లి గ్రామ మహిళలకు రామసేన అధ్యక్షుడు 'కంబాల శ్రీనివాసరావు' ఉచితంగా 700 పట్టు చీరల పంపిణీ...!!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె):గోకవరం మండలం ఇర్లంకపల్లి, పెంటపల్లి గ్రామాలలో నిర్వహించిన 'కంబాల కానుక.. వనితల వేడుక' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రకమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని రెండు గ్రామాలకు చెందిన మహిళలకు 700 పట్టు చీరలను ఉచితంగా పంపిణీ చేశారు. తొలిత కంబాల శ్రీనివాసరావు వీర్లంకపల్లి గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. గ్రామంలో పలు ఆలయాలను దర్శించుకుని, పూజలు నిర్వహించి, అమ్మవారికి తొలి చీరను అందజేశారు. వీర్లంకపల్లి గ్రామంలో 230 మంది మహిళలకు పట్టు చీరలను ఉచితంగా పంపిణీ చేసారు. అనంతరం పెంటపల్లి గ్రామాన్ని సందర్శించి, గ్రామంలో ఆలయాలను దర్శించుకున్నారు. పెంటపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో 470 మంది మహిళలకు ఉచితంగా పట్టు చీరలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల సంక్షేమం ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సమాజంలో మహిళలకు గౌరవప్రదమైన స్థానం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మహిళలకు అండగా నిలుస్తూ భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.ప్రజల ఆశీర్వాదం, అభిమానంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ, సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

## నేడు గుడివాడకు సీఎం చంద్రబాబు... స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొనున్న సీఎం

-ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ముమ్మర సన్నాహాలు...

కూటమి నాయకత్వం రంగంలోకి

ప్రజా ఉత్సవంగా సీఎం పర్యటన నిర్వహిస్తాం: ఎమ్మెల్యే రాము

-సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ బాలాజీ సమీక్ష... అధికారులకు దిశానిర్దేశం

-గుడివాడలో భారీ ఏర్పాట్లు... హెలిప్యాడ్, బహిరంగ సభ, కార్యకర్తల సమావేశ వేదికలు ఖరారు-గౌతమ్ పాఠశాల వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమం...

పలు ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు-కీలక సూచనలు చేసిన ఎమ్మెల్యే రాము....

సీఎం పర్యటన విజయవంతానికి కూటమి నాయకత్వానికి పిలుపునిచ్చిన ఎమ్మెల్యే



గుడివాడ జులై 17 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గుడివాడకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. గౌతమ్ పాఠశాల వద్ద జరగనున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు.సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సీఎంఒ అధికారులతో కలిసి గుడివాడ బైపాస్ రోడ్డు, ఇంజనీరింగ్ కళాశాల, ఏఎన్ఆర్ కళాశాలను పరిశీలించారు.

కలెక్టర్ బాలాజీ అధ్యక్షతన సమీక్ష సీఎం పర్యటన విజయవంతానికి గుడివాడ మున్సిపల్ కౌన్సిల్ హాల్లో కలెక్టర్ డీకే బాలాజీ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భద్రత, ట్రాఫిక్, ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని పర్యటన ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సీఎం పర్యటనను ప్రజా ఉత్సవంగా నిర్వహిస్తామని, అధికారుల సమన్వయంతో కూటమి నాయకత్వం పూర్తి స్థాయిలో భాగస్వామ్యం అవుతుందని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు.వేదికలు ఖరారు సీఎం పర్యటనలో భాగంగా ఏఎన్ఆర్ కళాశాలలో హెలిప్యాడ్, ఎన్టీఆర్ స్టేడియంలో బహిరంగ సభ, బైపాస్ రోడ్డులోని యలవర్తి గ్రౌండ్స్ లో టీడీపీ ముఖ్య కార్యకర్తల సమావేశ



వేదికలను అధికారులు ఖరారు చేశారు.సీఎం పర్యటనకు గంటల వ్యవధి ఉండడంతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నాయకత్వంలో టీడీపీ నాయకత్వం ముమ్మర ఏర్పాట్లలో నిమగ్నమైంది. సీఎం పర్యటన ఏర్పాట్లు మరియు సమావేశంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కుమార్, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ తో పాటు పోలీస్ మరియు పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## "బలుసులమ్మ ఆలయంలో ప్రసాదం పంపిణీ చేసిన కొట్టు వెంకట్ (నాగు)"



తాడేపల్లిగూడెం జులై 17 (అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ)::: తాడేపల్లిగూడెం గ్రామ దేవత శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆషాడ మాసం శాకాంబరి అలంకారం సందర్భంగా శుక్రవారం వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, తణుకు వైసిపి పార్టీ పరిశీలకులు కొట్టు వెంకట్ (నాగు) శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరంగం అంజి మరియు మిత్రబృందం కొట్టు వెంకట్ (నాగు) కుటుంబానికి ఆలయం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొట్టు వెంకట్ నాగు మిత్ర బృందం ఆరిమిల్లి రవి, ఉదయ భాస్కర్, వంశీ, రూపు తదితరులు పాల్గొన్నారు.

## "గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్మూలించాలి డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్"



తాడేపల్లిగూడెం జులై 17 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ)గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా స్వచ్ఛతగా ఉండేందుకు అంత చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో ఎం. వెంకటేష్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ టి. రవిచంద్ర గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై తీసుకోవలసిన చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ఎం. రవి కిరణ్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ కు పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తున్న భక్తులు.



విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):-ఆషాఢ సారె మూడవ రోజు శుక్రవారం సందర్భంగా శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో మహిళల రద్దీ విశేషంగా పెరిగింది.సాయంత్రం 5 గంటల వరకు 27 సారె బృందాలు రాగా, సదరు బృందాలలో 15,968 మంది భక్తులు సారె సమర్పణకు వచ్చారు. దేవస్థానం వారు భవానీ అనుగ్రహ దర్శన్ క్యూ లైన్ (100/- దర్శనం లైన్ ) మొత్తం సారె భక్తులకు కేటాయించారు.సారె బృందాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, క్యూ లైన్ నిర్వహణ, దర్శనం క్యూ లైన్లు ఈవో శీనానాయక్ పరిశీలించారు.ఈ సంవత్సరం ఒక పద్ధతి ప్రకారం రిజిస్ట్రేషన్, క్యూ లైన్, దర్శనం,సారె సమర్పణ,ఆశీర్వచనం,అన్నప్రసాదం ఏర్పాటు చేసామని దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ తెలిపారు. గుంటూరు, బాపట్ల, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల నుండి సారె బృందాలు ఎక్కువగా తరలి వచ్చాయి. సారె బృందాల కోసం శ్రీ కనకదుర్గ నగర్ లో వాహనాల రాకపోకలను నియంత్రించి, సారె బృందాల సౌకర్యార్థం రైల్వే స్టేషన్, బస్ స్టాండ్ నుండి దేవస్థానం బస్సుల సంఖ్య ను పెంచారు.

## ఇంద్రకీలాద్రి సమగ్రాభివృద్ధిపై ఉన్నత స్థాయి సమీక్షా' సమావేశం

### పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా మాస్టర్ ప్లాన్.



విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రి పై ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం సమగ్ర అభివృద్ధి, భక్తుల సౌకర్యాల విస్తరణపై శుక్రవారం ఉదయం గొల్లపూడిలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది.?ఈ సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి కన్నబాబు, దేవాదాయ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ, నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ జి. రామకృష్ణ, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈవో వి.కె. శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.రాబోయే శ్రావణ మాసాన్ని దృష్టిలో ఉంచుకుని, భక్తుల కోసం నిర్మిస్తున్న నూతన అన్నప్రసాద భవనం, ప్రసాదం తయారీ పోటు (లడ్డూ పోటు) నిర్మాణాలను గడువులోగా పూర్తి చేసి, త్వరితగతిన ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ పనులను యుద్ధప్రాతిపదికన ముగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంద్రకీలాద్రి భవిష్యత్తు అవసరాల కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపకల్పన చేస్తున్న 'మాస్టర్ ప్లాన్' తయారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా కొండపైకి వచ్చే భక్తుల వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి ప్రతిపాదించిన మల్టీ లెవల్ పార్కింగ్, భద్రతా పరంగా కీలకమైన రెండవ ఘాట్ రోడ్ నిర్మాణ పనులలో ఎదురవుతున్న సాంకేతిక, ఇతర ఇబ్బందులపై మాస్టర్ ప్లాన్ రూపకర్తలతో అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ ప్రాధాన్యత గల పనులలో ఉన్న అడ్డంకులను త్వరలోనే తొలగించి, పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.?రోజురోజుకూ ఇంద్రకీలాద్రికి పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో శాశ్వత అభివృద్ధి పనులు జరగాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చే ప్రతి సామాన్య భక్తుడు క్షేమంగా, సౌకర్యవంతంగా దర్శనం చేసుకుని వెళ్లేలా మౌలిక వసతులు కల్పించాలని, తద్వారా భక్తుల సంతృప్తి స్థాయిని మరింతగా పెంచేందుకు తగిన విప్లవాత్మక చర్యలు చేపట్టాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ ఉన్నత స్థాయి సమావేశంలో దేవస్థాన ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, మాస్టర్ ప్లాన్ సాంకేతిక నిపుణులు, దేవాదాయ శాఖ, రెవెన్యూ విభాగాల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేత



విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):-శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఆగిరిపల్లి కి చెందిన వై శివ పార్వతి భర్త కీర్తిశేషులు పత్తిపాటి సాంబశివ ప్రసాద్ పేరున 1,00,116/- ఆలయ చైర్మన్ రాధాకృష్ణ గాంధీ కి అందజేసారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించి, వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని, లడ్డు ప్రసాదాలను అందజేశారు.

## గాంధీజీ మహిళా కళాశాలలో అగ్నిప్రమా నిరోధక అవగాహన కార్యక్రమం



విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):- నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలో అగ్నిప్రమాదాల నివారణ, ప్రజల్లో అగ్ని భద్రతపై అవగాహన పెంపొందించేందుకు శుక్రవారం ఉదయం గాంధీజీ మహిళా కళాశాలలో వీఎంసి ఆర్ ఎఫ్ ఓ రత్నబాబు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులకు అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక పరికరాల నిర్వహణ, వాటి వినియోగ విధానం, అత్యవసర పరిస్థితుల్లో పాటించాల్సిన భద్రతా చర్యలపై అధికారులు వివరంగా అవగాహన కల్పించారు.అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ప్రారంభ దశలోనే మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఫైర్ ఎక్స్టింగ్విషర్లను ఎలా ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్లు వంటి భద్రతా పరికరాలను ఏయే ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి, వాటి నిర్వహణ ఎలా ఉండాలి, స్మోక్ అలారం వ్యవస్థ ఎలా పనిచేస్తుందనే అంశాలను ప్రత్యక్షంగా వివరించారు. అలాగే భవనం చుట్టూ అత్యవసర నిష్క్రమణ మార్గాలు (ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు), ఫైర్ సేఫ్టీ సైన్‌బోర్డులు, విద్యుత్ వైరింగ్ నిర్వహణ, అగ్నిమాపక పరికరాల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేకంగా సూచనలు చేశారు.ప్రతి విద్యాసంస్థలో అగ్ని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయడంతో పాటు, అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో విద్యార్థులు, సిబ్బంది భయాందోళనలకు గురికాకుండా సురక్షితంగా బయటకు వెళ్లే విధానంపై తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వీఎంసీ ఫైర్ విభాగం సిబ్బంది, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం



విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):-విజయవాడ నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం గిరిపురం పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు.సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు.నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై, పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్‌చార్జ్) గోపాల్ నాయక్, జోనల్ కమిషనర్-- కె. ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ బి. కోటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మొబైల్ కోర్టులో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా




విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ నగరంలో పారిశుధ్యం, ప్రజారోగ్య పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలపై కఠిన చర్యలు కొనసాగిస్తోంది. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు శుక్రవారం సర్కిల్-1 కార్యాలయంలో సంచార న్యాయస్థానం (మొబైల్ కోర్టు) నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, రహదారులపై చెత్తాచెదారం వేయడం, రోడ్లపై పశువులు మరియు పెంపుడు కుక్కలను విచ్చలవిడిగా వదిలేయడం, కాలువల్లో వ్యర్థాలు వేయడం ద్వారా మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగించడం, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిని గుర్తించారు.ఈ ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 22 కేసులు నమోదు చేసి నిందితులను మొబైల్ కోర్టులో జడ్జి టి.ఎ.ఎస్.ఎస్.ఆర్.ఎ. రిషిక్ ఎదుట హాజరుపరిచారు. కేసులను విచారించిన జడ్జి నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించగా, మొత్తం రూ.5,780 జరిమానా వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.ప్రజారోగ్యానికి హాని కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. రహదారులు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, నిబంధనలను పాటించి నగర పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భవిష్యత్తులో కూడా మొబైల్ కోర్టుల ద్వారా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్వైజర్లు డి. సోమరాజు, ఎస్.వి.ఎస్. శ్రీధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మరియు ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ళ స్థలాలు ఇస్తాం.

### 'వన్ మంత్-వన్‌వార్డు' కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె, కలెక్టర్ లక్ష్మీశా



విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ళ కేటాయిస్తున్నామంటూ లబ్ధిదారులకు కాగితాలపై చూపించారని, తమ కూటమి ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు సెంట్ల స్థలాన్ని ఇస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. పేదలకు ఇళ్ళ స్థలాలు కేటాయించడానికి స్థలాలను సేకరించాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారన్నారు. శుక్రవారం ఉదయం తూర్పు లోని 21వ డివిజన్ కృష్ణలంక అమరజీవి పొట్టి శ్రీరాములు హైస్కూల్ ఆవరణలో 'వన్ మంత్--వన్ వార్డు' కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్, కలెక్టర్ లక్ష్మీశా, జాయింట్ కలెక్టర్ ఇలక్కియాతో పాటుగా వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలపై వినతి పత్రాలను స్వీరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'వన్ మంత్--వన్ వార్డు' కార్యక్రమంలో భాగంగా మూడో వారంలో కృష్ణలంకలో నిర్వహిస్తున్నామన్నారు. తమకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేయించాలని ఎక్కువ మంది ప్రజలు వినతిప్రతాలు ఇస్తున్నారని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తమకు ఇళ్ళు మంజూరు అయినట్లుగా కాగితాలు ఇచ్చారే కాని స్థలాలు ఇవ్వలేదని, అవి ఎక్కడున్నాయో చూపలేదని చాలా మంది వినతిపత్రాలు ఇచ్చారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రెండు స్థలాలు ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలెక్టర్లను ఆదేశించారని చెప్పారు. వివిధ అంశాలపై మొత్తం 87 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రతి జిల్లాలో ఈ కార్యక్రమం జరుగుతోందని, ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డాష్‌బోర్డ్‌కు వెళతాయన్నారు. ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను సాధన్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో గొరిపర్తి నామేశ్వరరావు, కొర్ర అప్పన్న, కొవ్వూరు కిరణ్, ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, పేరేపి ఈశ్వర్, పొతిరెడ్డి అనిత, గల్లా శ్రీను, పెద్ది అన్నారావు, గద్దె రమేష్, కొక్కెర తిరుపతయ్య, వేముల దుర్గారావు, చెన్నుపాటి ఉషారాణి, కొత్తపల్లి రమేష్, తాడువాయి సత్యనారాయణ, వేముల భవానీ, లక్ష్మి, సింగంశెట్టి రమేష్, కర్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గాయక సార్వభౌముడు శ్రీ పారుపల్లి రామకృష్ణ పంతులు కు ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే బొండా ఉమా

### పారుపల్లి రామకృష్ణ పంతులు పేరుతో రోడ్డుకు నామకరణం చేస్తాం. ఎమ్మెల్యే



విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):- 30వ డివిజన్ దేవీనగర్ రోడ్డు కాలువ సమీపంలోని గాయక సర్వభౌముడు శ్రీ పారుపల్లి రామకృష్ణ పంతులు వర్ధంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు పాల్గొని, ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ సంగీత ప్రపంచానికి అపూర్వమైన సేవలందించిన మహనీయులు శ్రీ పారుపల్లి రామకృష్ణ పంతులు అని కేవలం సంగీత విద్వాంసుడిగానే కాకుండా, ఎందరో గొప్ప కళాకారులను తీర్చిదిద్దిన ఆదర్శ గురువుగా చిరస్థాయిగా నిలిచారని అన్నారు. జీవితాంతం సంగీత బోధనకే అంకితమై, సంగీత సేవనే తన జీవిత ధ్యేయంగా భావించిన మహోన్నత వ్యక్తి ఆయన అని ఉమా కొనియాడారు.ఆయన సేవలకు గుర్తింపుగానే ఈ ప్రాంతానికి రామకృష్ణపురం అనే పేరు వచ్చిందని తెలిపారు. ఆయన శిష్యులలో సంగీత దిగ్గజాలు, పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, వంటి మహనీయులు ఉండటం పారుపల్లి రామకృష్ణ పంతులు విశిష్టతకు నిదర్శనమని పేర్కొన్నారు.ఎన్నో సంవత్సరాలుగా స్థానిక పెద్దలు, అభిమానులు, శిష్యులు కోరుకున్న మేరకు గత ఏడాది స్థానిక ఎమ్మెల్యే గా ఆయన విగ్రహాన్ని ఇక్కడ ఆవిష్కరించే అవకాశం దక్కడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆయన వర్ధంతి సందర్భంగా అభిమానులు, సంగీత ప్రియులు, శిష్యులు, స్థానిక పెద్దలు కలిసి ఘనంగా నివాళులర్పించడం సంతోషకరమని ఉమా అన్నారు.స్థానిక పెద్దల విజ్ఞప్తి మేరకు పారుపల్లి రామకృష్ణ పంతులు పేరుతో బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు, ఈ రహదారికి కూడా ఆయన పేరు పెట్టేందుకు జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు ప్రతిపాదనలు పంపించి, త్వరలోనే ఆ ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజల అభిప్రాయాలను, పెద్దల ఆకాంక్షలను గౌరవిస్తూ ముందుకు సాగడం తమ బాధ్యత అని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటామని చెప్పారు. "మాకు అధికారం అనేది అలంకారం కాదు. ప్రజలకు సేవ చేసే బాధ్యత" అని బొండా ఉమా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల రఘు రామ రాజు, పద్మశ్రీ అన్నవరపు రామస్వామి, మోదుమూడి సుధాకర్, పారుపల్లి సుబ్బారావు ఫల్గుణ్ , లోకనాథ శర్మ , తూములూరి కృష్ణచైతన్య, మద్దిరాల మురళీమనోహర శర్మ, పులిగడ్డ దయాకర్, ఉప్పులూరు శేషప్రసాద్ శర్మ, వీరుభొట్ల అరుణ్ కుమార్ , శంకరమంచి శాయి, వడగం వెంకట రమణమూర్తి, పారుపల్లి రామకృష్ణ పంతులు ప్రియ శిష్యులు, స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంగీత కళాకారులు తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

## ప్రజా దర్బార్‌కు విశేష స్పందన. ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

### ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):-అజిత్ సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ ప్రజా దర్బార్ ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత విశ్వసనీయ వేదికగా మారిందన్నారు. గత ఏడాదిన్నర కాలంగా వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖలకు పంపించి, వీలైనంత త్వరగా పరిష్కారం చూపామని తెలిపారు. పరిష్కారం ఆలస్యమయ్యే సమస్యల విషయంలో కూడా ప్రజలకు పూర్తి సమాచారం అందిస్తూ ఎమ్మెల్యే కార్యాలయం జవాబుదారీతనంతో పనిచేస్తోందన్నారు.ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు 12 కోట్లకు పైగా ఆర్థిక సహాయాన్ని సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు అందించామని తెలిపారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందన్నారు."పదవి అనేది అలంకారం కాదు. బాధ్యత" అనే భావనతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నామని చెప్పారు.చదువుతున్న విద్యార్థుల తల్లులకు శుభవార్త చెబుతూ, 'తల్లికి వందనం' పథకం కింద ఈ నెలలోనే నిధులు తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయని ఉమా తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించాలన్నదే, ప్రతి తల్లి ఆనందంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ తమకు గుర్తుందని, ఆర్థిక పరిస్థితుల కారణంగా కొంత ఆలస్యం జరిగినా ప్రతి హామీని తప్పకుండా అమలు చేస్తామని స్పష్టం చేశారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ సెంట్రల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మరింత బాధ్యతతో పనిచేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ విజయవాడ నగరంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అత్యంత వేగంగా ప్రజలకు చేరవేస్తున్న ఘనత బొండా ఉమాదే అని ప్రశంసించారు.ప్రతి నెల ఒకటో తేదీ ఉదయం 6 గంటలకల్లా రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ అయ్యేలా ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. విజయవాడలోనే అత్యంత బలమైన పార్టీ క్యాడర్ సెంట్రల్ నియోజకవర్గంలో ఉందని, కార్యకర్తలను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ వారికి అన్నలా అండగా నిలుస్తున్న నాయకుడు బొండా ఉమా అని కొనియాడారు.ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ఈ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందిస్తే తమ సమస్యకు తప్పకుండా పరిష్కారం లభిస్తుందనే నమ్మకం ప్రజల్లో బలంగా ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యత అని, ఇదే స్ఫూర్తితో ఎంపీ, ఎమ్మెల్యేలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని చిన్ని అన్నారు.

## గుడివాడ జనసేన పట్టణ అధ్యక్ష పదవిపై షేక్ నాగూర్ బాషా కన్ను




గుడివాడ, జులై 17 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) జనసేన పార్టీ గుడివాడ పట్టణ అధ్యక్ష పదవికి షేక్ నాగూర్ బాషా పేరు ప్రధానంగా వినిపిస్తోంది.పార్టీ ఆవిర్భావం నుంచి జనసేన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పనిచేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ పార్టీ తరఫున ప్రజల పక్షాన నిలుస్తున్నారని కార్యకర్తలు చెబుతున్నారు.గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్‌తో కలిసి పార్టీ కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటున్నారు.యాదవ సామాజిక వర్గానికి చెందిన యువతిని కులాంతర వివాహం చేసుకుని సామాజిక సామరస్యానికి ఆదర్శంగా నిలిచారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల మచిలీపట్నం సమాచార సేకరణ కార్యక్రమంలో గుడివాడ పట్టణ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు.మైనారిటీ వర్గానికి చెందిన నాయకుడిగా అవకాశం కల్పించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి.పలువురు జనసేన కార్యకర్తలు, నాయకులతో పాటు కూటమి నాయకులు కూడా షేక్ నాగూర్ భాష అభ్యర్థిత్వానికి మద్దతు తెలుపుతున్నట్లు సమాచారంఅధిష్ఠానాన్ని కోరుతున్నట్లు తెలుస్తోంది.

## క్షణికావేశంలో కుమారుడిని కర్రతో కొట్టి చంపిన తండ్రి.

**-మచిలీపట్నం మంగినపూడి బొట్లవానిపాలెంలో దారుణం**



మచిలీపట్నం, ఏప్రిల్ 17 (అజయ్ నారగాని - నేటి శుభోదయ ) కృష్ణాజిల్లా మచిలీపట్నం మంగినపూడి బొట్లవానిపాలెంలో క్షణికావేశం ఒక కుటుంబంలో విషాదం నింపింది. కుమారుడిపై కోపంతో కర్రతో దాడి చేసిన తండ్రి కొడుకు ప్రాణాలు పోయాయి.పోలీసుల వివరాల ప్రకారం బొట్లవానిపాలెంకు చెందిన రామ్మోహన్ రావు ఇంట్లో ఆయన కుమారుడు కళ్యాణ చక్రవర్తి(30)తో తల్లికి మధ్య ఏదో విషయంలో గొడవ జరిగింది. దీన్ని సర్దిచెప్పే క్రమంలో రామ్మోహన్ రావు క్షణికావేశానికి గురయ్యారు. ఆవేశంలో కుమారుడు కళ్యాణ చక్రవర్తిపై కర్రతో విచక్షణారహితంగా దాడి చేశారు. దాడిలో కళ్యాణ చక్రవర్తికి తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే ఆసుపత్రికి తరలించేలోపే అతను మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి రామ్మోహన్ రావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో బొట్లవానిపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## "గ్రామాల అభ్యుదయ మే కూటమి ప్రభుత్వ లక్ష్యం:ఎమ్మెల్యే బొలిశెట్టి"



పెంటపాడు జులై 17 (అవినాష్ మారంపూడి నేటి-శుభోదయ) గ్రామాల అభ్యుదయమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండలం అల్లంపురం గ్రామంలో శుక్రవారం పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొలిశెట్టి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు భారీగా నిధులు కేటాయించిందని పేర్కొన్నారు.కొత్త పెన్షన్లపై ప్రజల్లో ఉన్న సందేహాలను ప్రభుత్వం త్వరలోనే పరిష్కరిస్తుందని చెప్పారు.గత ప్రభుత్వం ఎన్నికల ముందు మాత్రమే కొత్త పెన్షన్లు ఇచ్చిందని విమర్శించారు.తల్లికి వందనం పథకం కింద అల్లంపురం గ్రామ ప్రజలకు ఏడాదికి రూ.82.95 లక్షలు అందుతున్నాయని తెలిపారు.ఆటో నేస్తం పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు.అన్నదాత సుఖీభవ పథకం కింద 355 మంది రైతులకు రూ.1.40 కోట్ల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు.ఇన్‌పుట్ సబ్సిడీగా 258 మంది రైతులకు రూ.30.09 లక్షలు పంపిణీ చేశామని తెలిపారు.గ్రామంలో కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేశామని చెప్పారు.ప్రభుత్వ పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామస్థాయిలో చర్చలు జరగాలని పిలుపునిచ్చారు.కుల, మతాలకు అతీతంగా ముందుకు సాగాలని సూచించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు.కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ చొరవతో రూ.2 కోట్లతో డయాలసిస్ కేంద్రం మంజూరైందని తెలిపారు.గ్రామ రహదారుల అభివృద్ధికి అదనంగా నిధులు కేటాయించారని చెప్పారు.జల్ జీవన్ మిషన్ పనులు త్వరలోప్రారంభమవుతాయని వెల్లడించారు.గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.కేంద్ర ప్రభుత్వం బీబీఆర్ఎంబీ కింద రూ.7,787 కోట్ల నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు.గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.3.30 కోట్లతో పనులు చేపడుతున్నామని తెలిపారు.ప్రతిపక్షం అభివృద్ధిపై కాకుండా వ్యక్తిగత విమర్శలకే పరిమితమైందని ఆరోపించారు.గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు, అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని అన్నారు.జగన్ మోహన్ రెడ్డి ప్రజలను కుల, మతాల పేరుతో విభజించే రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.భూ హక్కుల చట్టాలు, పాస్‌బుక్ల వ్యవహారంలో గత ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు.చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పోలవరం, అమరావతి అభివృద్ధిపై దృష్టి సారించిందని చెప్పారు.గత ఐదేళ్లలో అమరావతి అభివృద్ధి నిలిచిపోయిందని ఆరోపించారు.రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందని పేర్కొన్నారు.వ్యక్తిగత దూషణలు, సోషల్ మీడియాలో వేధింపుల రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని కోరారు.కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.రైతు భరోసా, ఎన్టీఆర్ భరోసా, ఆటో నేస్తం, పెన్షన్ల వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు.ఆక్వా రైతుల సమస్యలపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆక్వా రంగం కుదేలైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులను ఆదుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ల సమర్థవంతమైన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో దూసుకుపోతుందని, దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఇంచార్జ్ ఈతకోట తాతాజీ పెంటపాడు మండల పరిషత్ అధ్యక్షురాలు కట్టు బోయిన వెంకటలక్ష్మి, పెంటపాడు మండల జనసేన అధ్యక్షుడు పుల్లా బాబి, అలంపురం సొసైటీ అధ్యక్షులు పారిశెర్ల ప్రసాద్, తెలుగుదేశం పార్టీ పెంటపాడు మండల అధ్యక్షులు కిలపర్తి వెంకటరావు, పాతూరి రాంప్రసాద్ చౌదరి, టి. భోగేశ్వరరావు, కత్తి ముక్కల గణేష్, రైతులు,ప్రభుత్వ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## నీట్-2026 ఫలితాల్లో వంద శాతం సక్సెస్ రేట్ తో 'సర్వజ్ఞ'



ఖమ్మం, నేటి శుభోదయ ::: శుక్రవారం ప్రకటించిన నీట్ -2026 ఫలితాలలో సర్వజ్ఞ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభకనబర్చి అత్యుత్తమ ఆలిండియా ర్యాంకులు సాధించారు. నీట్-2026 ఫలితాల్లో సర్వజ్ఞ విద్యార్థులు ఎం. లక్ష్మీదేవి (ఆల్ ఇండియా ర్యాంక్ 8355), బి. మెర్సి (ఆల్ ఇండియా ర్యాంక్ 8757), కె. సింధు (ఆల్ ఇండియా ర్యాంక్ 9833), ఎ. తన్విత్ (ఆల్ ఇండియా ర్యాంక్ 14118), కె. మైథిలి (ఆల్ ఇండియా ర్యాంక్ 37508) సత్తా చాటారు.స్థాపించిన మొదటి సం,, లోనే కేవలం అతికొద్ది మంది విద్యార్థులతో నిర్వహించిన నీట్ లాంగ్ టర్మ్ శిక్షణలో ఈ అత్యుత్తమ ర్యాంకులు సాధించడమేకాక 100 శాతం విద్యార్థులకు ఎం బిబిఎస్ సీట్లు సాధించడం గర్వకారణంగా వుందని సర్వజ్ఞ విద్యాసంస్థలు చైర్మన్ ఆర్ వి నాగేంద్ర కుమార్ తెలిపారు.ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులను 'సర్వజ్ఞ' విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, అకాడమిక్ డీన్ జనార్ధన్, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

## 'ప్రముఖ దాత రావిపాటి శ్రీనివాసరావును ఆదర్శంగా తీసుకోవాలి..'

**- జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు.- 21 మంది విద్యార్థులకు 50వేల రూపాయలు క్యాష్ బహుమతి, సర్టిఫికెట్ మెడల్స్ ని అందజేత..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోరుకొండ నందు 13వ శ్రీ రావిపాటి శ్రీనివాసరావు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మణికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు ముఖ్యఅతిథిగా హాజరై, 21 మంది విద్యార్థులకు 50వేల రూపాయలు క్యాష్ బహుమతి సర్టిఫికెట్ మెడల్స్ ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావిపాటి శ్రీనివాసరావు జీవితాన్ని విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కుశలవదొర , రావిపాటి శ్రీనివాసరావు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కోలా సత్యనారాయణ, సభ్యులు పుల్లెల గంగరాజు కాపు, కొడవటి సూర్యనారాయణ, కొడవటి మధుబాబు, కండబత్తుల అప్పల శ్రీనివాస్, శీలం వీరబాబు పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# రానున్న 2 నెలల్లో తూర్పులో 250 కోట్ల వ్యయంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు

**తూర్పు లో ఎమ్మెల్యే గద్దెతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ కేశినేని శివనాథ్**



విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):- విజయవాడ నగరంలో ఏ అభివృద్ధి పని జరిగినా అది టీడీపీ ప్రభుత్వ హాయంలోనే జరిగిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.శుక్రవారం ఉదయం తూర్పులోని 2,3,4,5 డివిజన్ల పరిధిలో 7 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు జరిగాయి. ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె అతిథులుగా హాజరై భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలోనే (శుక్ర, శని వారాలు) 14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నామని చెప్పారు. విజయవాడ నగరంలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం జరుగుతున్నాయన్నా, స్టార్మ్ వాటర్ పనులు చేపట్టారన్నా అది టీడీపీ ప్రభుత్వం హయాంలోనేనని తెలిపారు. తూర్పు లో ఎన్నో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నామని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యే గద్దె తో కలిసి అనేక సార్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిసి అనేక అభివృద్ధి పనుల గురించి వివరించి నిధులు మంజూరు చేయించుకున్నామని వివరొంచారు. ఎమ్మెల్యే ఎల్లప్పుడూ ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులను అప్రమత్తం చేస్తూ నిధులు మంజూరు చేయించుకుని అనేక అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. అమరావతి అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతగా కృషి చేస్తున్నారో తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి గద్దె కూడా అంతే స్థాయిలో కృషి చేస్తున్నారని చెప్పారు. గుణదల కొండ చుట్టూ ఉన్న ప్రాంతాల్లోని ప్రతి సమస్యను పరిష్కరించడానికి ఆయన చర్యలు తీసుకుంటున్నారన్నారు. విజయవాడ తూర్పుతో పాటుగా సెంట్రల్, వెస్ట్ ప్రాంతాల్లోని కొండ ప్రాంతాల్లోని నివాసితులకు జీవో నెంబరు--30 ద్వారా ఇళ్ళ పట్టాలను కూడా రెగ్యులరైజేషన్ చేయించనున్నామని చెప్పారు. గద్దె ద్వారా త్వరలోనే 45 వేల మందికి ఇళ్ళ పట్టాలు అందించనున్నామన్నారు. రాయనపాడు రైల్వేస్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేసి శుక్రవారం ప్రారంభించు కుంటున్నామని, త్వరలోనే గుణదల రైల్వేస్టేషన్‌ను కూడా ప్రారంభిస్తామని చెప్పారు. రెండు ఆర్వోబీల నిర్మాణానికి అనుమతులు మంజూరు అయ్యాయని, వాటిలో ఒక ఆర్వోబీ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, త్వరలోనే మరొక ఆర్వోబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గుణదల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గుణదల ప్రాంతంలో ఏ అభివృద్ధి చేసినా అది ఎమ్మెల్యే హయాంలోనేనని చెప్పారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎంపీ చెప్పారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ తూర్పు లోని సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరామన్నారు. వర్షం వచ్చినప్పుడు కొండపై నుంచి నీటితో పాటుగా మట్టి కూడా జారి డ్రెయినేజీలో కలుస్తోందని ఈ సమస్యను పరిష్కరించడానికి 7 కోట్ల వ్యయంతో ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టామని చెప్పారు. మాచవరం ప్రాంతంలో ఈ ప్రాజెక్టు పనులను త్వరలో చేపడతామన్నారు. రహదారుల నిర్మాణం కోసం 11 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశామన్నారు. క్రీస్తురాజపురం ప్రధాన రోడ్డు నిర్మాణానికి 2014--19 హాయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 7 కోట్లు కేటాయించారని, 4 కోట్ల వ్యయంతో రోడ్లు నిర్మాణం చేశామని, మిగిలిన 3 కోట్ల వ్యయంతో రోడ్డుపై అదనపు హంగులు ఏర్పాటు చేయడానికి మిగిలి ఉండగా 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు అభివృద్ధిపై అస్సలు దృష్టి పెట్టలేదన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ రోడ్డును అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2.40 కోట్లను కేటాయించారన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో నియోజకవర్గంలో ప్రధాన రహదారుల నిర్మాణానికి 7 కోట్లతో శనివారం శంకుస్థాపనలు చేయనున్నామని చెప్పారు. రానున్న కాలంలో 250 కోట్ల వ్యయం విలువైన పనులు ఒక్క తూర్పు లోనే చేపట్టనున్నామని, రెండు నెలల వ్యవధిలోనే ఈ పనులను కూడా చేపడతామని గద్దె అన్నారు. ఈ కార్యక్రమంలో జాస్తి సాంబశివరావు, తాడి బాబూరావు, గద్దె రమేష్, ముమ్మనేని ప్రసాద్, పేరెపి ఈశ్వర్, చెన్నుపాటి ఉషారాణి, యెర్నేని వేదవ్యాస్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, దాసరి గాబ్రియేల్, సుగసాని రత్నశ్రీ కృష్ణ ప్రసాద్, బచ్చులకూరి అజయ్ కుమార్, నందిపాటి దేవానంద్, అనుమోలు పూర్ణ చంద్రరావు, వెల్లంకి సుధాకర్, మండల గణేష్, సుబ్రహ్మణ్యం, మల్లెల రామకృష్ణ, కార్పొరేషన్ ఈ.ఈ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంధాల యాల అభివృద్ధికి కృషి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బి.వెంకటనారాయణ



అనంతపురం ,జులై 17 నేటి శుభోదయ:ఉమ్మడి అనంతపురం జిల్లాలోనిగ్రంధాలయాలనుఅభివృద్ధి పథంలో తీసుకెళ్లే విధంగా కృషి చేస్తామని అనంతపురం జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బి .వెంకటనారాయణ(బి . వెంకట్) తెలిపారు.శుక్రవారం అనంతపురం జిల్లా కేంద్రంలోనిగ్రంథాలయ సంస్థ చైర్మన్ ఛాంబర్ లో ఉమ్మడి జిల్లా గ్రంధాల సంస్థ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2026 - 27 వార్షిక బడ్జెట్ మంజూరైన నేపథ్యంలో పరిపాలన అనుమతితో సంస్థ నిధులను ఖర్చు చేయుటకు సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంధాల సంస్థచైర్మన్ వెంకట్ మాట్లాడుతూజిల్లావ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో పుస్తకాల విభాగాలు, పాఠకులకు అందుతున్న సేవలనుమరింతగావిస్తృతంగా చేసి తగినంతగా వసతులు కల్పించడం జరుగుతున్నదని తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకొని వాటి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం గ్రంధాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకుచర్యలుతీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అంతేగాకవిద్యార్థుల కోసం పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలుకు గ్రంథాలయాల మౌలిక వసతులు కల్పనకు గ్రంథాలయాలను దశల వారీగా డిజిటలైజేషన్ చేసే విధంగా ప్రణాళికకు ప్రాధాన్యం కల్పించడం జరిగిందన్నారు. ఈరోజు రాష్ట్రంలో కూటమీ ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ సారధ్యంలో గ్రంథాలయాల అభివృద్ధి, డిజిటలైజేషన్, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పుస్తకాల కొనుగోలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమావేశంలోఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్ల పెన్షన్ల చెల్లింపుల కోసం రూ.18.21కోట్లను ఆమోదించారు. గ్రంథాలయాల మరమ్మతులకు రూ.2.28 కోట్లు మహిళా విభాగం మరియు పిల్లల విభాగం ఉన్న ఆడిటోరియం ను ఎన్.టి. ఆర్ స్టడీ సెంటర్ మరమత్తుల కొరకు రూ60,60,000/-. ఈ స్టడీ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతి యువకుల కొరకు పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాల కొనుగోలు , అధునాతన ఫర్నీచర్, కంప్యూటర్స్, ఎ/సి సౌకర్యాలు మొదలగునవి కల్పించి నిరుద్యోగ యువతి యువకులుకుఉపయోగార్థం ప్రణాళిక లు వీలైనంత త్వరగా ఈ ఏడాది డిసెంబర్-2026లో పుఅంధుబాటులోతీసు కొని వస్తామన్నారు. ఇందుకు దాతలు దాతలు సహకరించాలన్నారు. పదవి చేపట్టినప్పుడుప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రంథాలయ సెస్ రూపంలో రూ.4 కోట్లు అందాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సెస్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సమావేశంలో గ్రంథాలయ సెస్‌ను చట్టం ప్రకారం నెలవారీగా గ్రంథాలయ ఖాతాలకు జమ చేస్తామని ప్రకటించడాన్ని సమావేశం స్వాగతిస్తూ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగాగ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా అభివృద్ధి చేసే ప్రణాళికను వివరించారు. అలాగే సిఎస్ఆర్ నిధులతో గ్రంథాలయాలను ఆధునీకీకరించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు.ఈ బడ్జెట్ సమావేశంలో గ్రంథాలయాల అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, సెస్ వసూళ్ల పెంపు, డిజిటలైజేషన్, విద్యార్థులకు నాణ్యమైన సేవలను కల్పించే విధంగా ముందస్తు ప్రణాళిక చర్యలను సమగ్రంగా చర్చించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి గ్రంథాలయాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని చైర్మన్ తెలిపారు.జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు సమాచారశాఖ ఎ పిఆర్ఓ ఆర్ ఫక్రుద్దీన్ గ్రంథాలయ కార్యదర్శి శివ ప్రసాద్ కార్యాలయసిబ్బంది ఆర్.యస్.రాజు, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అతి త్వరలో అమరావతి కి బుల్లెట్ ట్రైన్

**హైడ్రోజన్ పవర్ తో నడిచే అత్యాధునిక రైలుతో పాటు రాయనపాడు సహా పలు రైల్వే స్టేషన్ లను వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోడీ.**

**దేశవ్యాప్తంగా 1000 స్టేషన్లను అమృత్ భారత్ కింద అభివృద్ధి చేసే దిశగా ఎన్డీఏ**



విజయవాడ, జూలై 17 (నేటి శుభోదయ):- ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం రాయలపాడు లో శుక్రవారం అమృత్ భారత్ పథకం కింద ఏర్పాటైన రాయనపాడు శాటిలైట్ రైల్వే స్టేషన్ ను భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్ గా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో కలిసి ముఖ్య అతిథిగా ఎంపీ పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీ కేశినేని చిన్నికి రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యక్రమంలో భాగం గా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఎంపీ వీక్షించారు అనంతరం వర్చువల్ గా ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా స్టేషన్ ను ప్రారంభించిన అనంతరం స్టేషన్ లోపల ఏర్పాటు చేసిన టికెట్ కౌంటర్స్ ప్లాట్ఫార్మ్ ను మంత్రి, ఎమ్మెల్యే రైల్వే అధికారులు, జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా తో కలిసి ఎంపీ చిన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీ చిన్ని మాట్లాడుతూ డబల్ ఇంజన్ సర్కార్ పవర్ ద్వారా ఇవాళ 75 స్టేషన్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదగా ప్రారంభమవుతున్నాయని భారతదేశంలో తయారైన హైడ్రోజన్ పవర్ తో నడిచే రైలు కూడా ఇవాళ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఓపెన్ చేయడమే అన్నిటికన్నా గొప్ప విషయం అని తెలిపారు.సుమారు 1000 అమృత్ భారత్ స్టేషన్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక 72 స్టేషన్లు ఒక్కఆంధ్రప్రదేశ్ కే వచ్చాయంటే ఆంధ్రప్రదేశ్ కు ఎన్డీఏ గవర్నమెంట్ ఇచ్చే గౌరవం ఏంటో ప్రతి ఒక్కరికి అర్థమవుతుంది అని అన్నారు.రాయనపాడు అంటేనే రైల్వే వారి వేగన్ వర్క్ షాప్ ఇక్కడ ఉండేది.రాయనపాడు ప్రాంతంలో ఎన్నో రైల్వే లైన్లు వెళతాయి రైల్వే ఉద్యోగులు ఎక్కువగా నివసించే ప్రాంతంగా కూడా ఇదే ఈ ప్రాంతంలో ఒక అమృత్ భారత్ స్టేషన్ 25 కోట్ల రూపాయలతో ఖర్చు పెట్టి ఇవాళ ప్రారంభించడం ఇవాళ ఈ ప్రాంతానికి ఒక వన్నెతెచ్చిన విషయం అని అన్నారు.మంత్రి సహకారంతో నేను ఈ ప్రాంతంలో దాదాపు మూడు ఆర్ఓబిలు ఒక ఆర్ యు బి కూడా తీసుకొచ్చాం, ఈ ప్రాంతమంతా పరిశీలించి నేను స్థానిక ఎమ్మెల్యే కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి రాయనపాడు ఆర్ఓబి ఈలప్రోలు ఆర్ ఓ బి కొండపల్లి ఎస్టీ కాలనీ ఆర్ యు బి గొల్లపూడి ఆర్ఓబి కూడా తీసుకువచ్చామని రామవరప్పాడు గుణదల, గుణదల్లో రెండు ఆర్ఓబీలు రామవరప్పాడు స్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ కావాలని కోరడం జరిగింది అని ఎంపీ తెలియచేసారు. విజయవాడ మెయిన్ రైల్వే స్టేషన్ కి 835 కోట్లతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలనుకున్నప్పుడు వైబుల్ గ్యారెంటీ కింద 235 కోట్లు కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖ వారు సహాయంతో మూడుసార్లు టెండర్ వేశారని అయిన ఎవరు ముందుకు రాలేదని అన్నారు.నా పార్లమెంట్లో మూడు రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ కింద వెళుతుంది అంటే అంతకంటే మరో అదృష్టం నాకు లేదు అని అన్నారు కొండపల్లి రైల్వే స్టేషన్ లో త్రాగునీరు ప్లాట్ఫామ్ లు టాయిలెట్స్ సరిగా లేవని డిఆర్ఎమ్ కు తెలిపిన వెంటనే 10 కోట్లు శాంక్షన్ చేయడం జరిగింది అని తెలిపారు.సార్ థాంక్యూ వెరీమచ్ ఫర్ కొండపల్లి కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి కూడా ఎమ్మెల్యే తో కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు రైళ్ల కనెక్టివిటీ పెంచాలని డిఆర్ఎం ను విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. గొల్లపూడి నుండి రాయన పాడు వచ్చే రోడ్డు కూడా రైల్వే అధికారులు పరిశీలించి రోడ్డును కూడా బాగు చేయించవలసిందిగా కోరుతున్నాం అని ఎంపీ తెలియచేసారు ముఖ్యమంత్రి చంద్రబాబు అనునిత్యం రాష్ట్రం కోసం తప్పించే వ్యక్తి అని మన రాజధాని అమరావతిలో త్వరలో బుల్లెట్ ట్రైన్ ను చూద్దామని ఆశిస్తున్నట్లు తెలిపారు.అతి త్వరలో బుల్లెట్ ట్రైన్ కూడా ఈ ప్రాంతం చూడబోతుంది అని అన్నారు ఈ అన్ని విషయాలపై సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రాగుల సేకరణకు ప్రభుత్వం ఆమోదం

**జూలై 31 వరకు గడువు పొడిగింపు... మంత్రి సవిత వినతితో సానుకూల నిర్ణయం తీసుకున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**



అనంత పురం బ్యూరో జూలై 17 నేటి శుభోదయ:సత్యసాయి జిల్లాతో పాటు రాష్ట్రంలోని రాగులు పండించిన రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, 2025--26 రబీ సీజన్‌కు సంబంధించిన మిగిలిన రాగుల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అలాగే రాగుల సేకరణ గడువును 2026 జూలై 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.రాగులు సాగు చేసిన రైతులకు తమ ఉత్పత్తిని ప్రభుత్వానికి విక్రయించే అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతుల సమస్యను సానుకూలంగా పరిగణించిన మంత్రి నాదెండ్ల మనోహర్ అవసరమైన చర్యలు చేపట్టడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని రాగుల రైతులకు గణనీయమైన ఊరట లభించనుంది. రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు, ఇతర మార్గదర్శకాలను పాటిస్తూ, నిర్ణయించిన గడువులోపు సమీప సేకరణ కేంద్రాలకు తమ రాగులను తీసుకువచ్చి విక్రయించుకోవాలని ప్రభుత్వం సూచించింది.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదించిన 5,000 మెట్రిక్ టన్నుల రాగుల సేకరణకు అదనంగా, మరో 2,500 మెట్రిక్ టన్నుల రాగుల సేకరణకు కూడా అనుమతి ఇచ్చింది. దీంతో మొత్తం 7,500 మెట్రిక్ టన్నుల రాగులను ప్రభుత్వం సేకరించనుంది..ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రైతుల సంక్షేమం, వారి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఎల్లప్పుడూ సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని ఆమె పేర్కొన్నారు.

# ఈనెల 24వ తేదీన మెగా పేరెంట్ - టీచర్ మీట్ నిర్వహణ

**జిల్లాలో 1,724 పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహణ..**

**హాజరుకానున్న 10,499 మంది ఉపాధ్యాయులు, 1,28,644 తల్లిదండ్రులు, 1,67,434 మంది విద్యార్థులు..**

**విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా మెగా పీటీఎం కార్యక్రమంలో పాల్గొనాలి**

**సమన్వయంతో ఈ నెల24న జరగబోవు మెగా పేరెంట్ టీచర్ మీట్ కార్యక్రమం విజయవంతంగా పండుగ వాతావరణంలో నిర్వహణ– జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



అనంతపురం బ్యూరో జులై 17 నేటి శుభోదయ:ఈనెల 24వ తేదీన మెగా పేరెంట్ - టీచర్ మీట్ (మెగా పీటీఎం) కార్యక్రమం జిల్లాలో పండుగ వాతావరణంలో నిర్వహించబడుతుంది అని, సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో మెగా పేరెంట్ - టీచర్ మీట్ (మెగా పీటీఎం)పై ఇంచార్జి డిఈఓ శ్రీనివాసరావుతో కలిసి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రాబోయే 24వ తేదీ శుక్రవారం రోజు మెగా పేరెంట్ - టీచర్ మీట్ (మెగా పీటీఎం) నిర్వహిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా 1,724 పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో 10,499 మంది ఉపాధ్యాయులు, 1,28,644 తల్లిదండ్రులు, 1,67,434 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ప్రభుత్వం తరపునుంచి గతేడాది ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఈ విద్యా సంవత్సరంలో మొదటిసారి మెగా పీటీఎం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను రాబోయే రెండు మూడు రోజుల్లో ఉపాధ్యాయులు ఆహ్వానిస్తారని తెలిపారు. మినిట్ టు మినిట్ కార్యక్రమంను ప్రభుత్వం తరపు నుంచి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకి సంబంధించి అంటే రాబోయే సంవత్సరంలో, ఇంతకు ముందు సంవత్సరంలో ఏ విధంగా చదివి ఉన్నారు, అదే కాకుండా రాబోయే సంవత్సరంలో ఏం చేయబోతున్నాము అన్నది అక్కడ తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా మాట్లాడడం జరుగుతుందన్నారు. అదేవిధంగా గ్యారంటీడ్ ఫంక్షనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (జిఎఫ్ఎల్ఎన్) గతేడాది 75 రోజుల పాటు ఒక కార్యక్రమం చేయడం జరిగిందని, విద్యార్థులు మొదటి స్థాయిలో ఏ విధంగా ఉన్నారు, వాళ్ళకి మాథ్స్ కానీ, బేసిక్ లాంగ్వేజ్ కానీ, తెలిసిన విషయాలు ఎంతవరకు తెలిసి ఉన్నాయి, ఎంతవరకు ఇంప్రూవ్ చేయగలిగాము అనే దానిపై వివరించడం జరుగుతుందన్నారు. గత ఏడాది ఎక్కువ మంది తల్లులు మాత్రమే ఈ కార్యక్రమానికి హాజరు కావడం జరిగిందని, ఈ ఏడాది విద్యార్థుల తల్లులతోపాటు తండ్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ఎక్కడికక్కడ పాల్గొనాలన్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులకు ఎంపిడిఓ, ఎంఇఓ లు తెలిపి పాల్గొనేలా చూడాలని తెలిపారు.అదేకాకుండా ఈ సంవత్సరం మనకు రెండు యాక్టివిటీస్ కూడా అదనంగా చేస్తున్నామన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ద్వారా రెండు మూడు నెలల్లో ప్రతి ఒక్క స్కూల్ కి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సదుపాయాలకు అదనంగా ఏదైనా అవసరం ఉన్నచో వాటి వివరాలను తీసుకుని ప్రతిపాదనలు చేసుకుని ఒక డోనర్ ప్లాట్ఫామ్ కూడా ఆన్లైన్లో ఉంచడం జరిగిందని, ఆ డోనర్ ప్లాట్ఫామ్ ద్వారా ఎవరైనా చిన్నచిన్న వస్తువులు, పరికరాలు పాఠశాలలకు అందించవచ్చని తెలిపారు. దాతలు నేరుగా డోనర్ ప్లాట్ఫామ్ ద్వారా వివరాలు చూసుకుని డొనేట్ చేయడానికి అవకాశం ఉందని, డోనర్ ప్లాట్ఫామ్ గురించి తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. ప్రభుత్వం తరపు నుంచి లీప్ యాప్ అమలు చేయడం జరిగిందని, ప్రతి ఒక్క తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలకు సంబంధించిన ఎడ్యుకేషన్ సంబంధించిన విషయాలు, అటెండెన్స్, మార్కులు కావచ్చు, లేదంటే తల్లిదండ్రులు పిల్లలతో ఏ విధంగా మాట్లాడాలి, ఏ విధంగా విద్యార్థుల అకడమిక్ ఎక్సలెన్స్ ఇంప్రూవ్ చేయాలంటే ఏం సపోర్ట్ చేయాలి, లాంటివి కూడా ఈ లీప్ యాప్ ద్వారా వ్యక్తిగతంగా తల్లిదండ్రులకి తెలియజేయడానికి ప్రభుత్వం అమలు చేయడం జరిగిందన్నారు. లీప్ యాప్ ప్రతి ఒక్క తల్లిదండ్రులు డౌన్లోడ్ చేసుకోవాలని కోరుతున్నామన్నారు. డోనర్ ప్లాట్ఫామ్, లీప్ యాప్ గురించి మెగా పీటీఎంలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మెగా పీటీఎం నిర్వహణ గురించి విస్తృతంగా ప్రచారం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

### మినిట్ టు మినిట్ కార్యక్రమం వివరాలు :

మెగా పీటీఎం నిర్వహణకు సంబంధించి మినిట్ టు మినిట్ కార్యక్రమం వివరాలను జిల్లా కలెక్టర్ తెలిపారు.ఉదయం 9:00 గంటల నుంచి 09:30 గంటల వరకు మెగా పీటీఎం ప్రారంభోత్సవం, తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, తదితరులు సీట్లలో కూర్చోవడం ఉంటుంది.ఉదయం 09:30 గంటల నుంచి 10:50 గంటల వరకు వన్ అండ్ వన్ ఇంటరాక్షన్, లీప్ యాప్ గురించి తెలపడం, కెరీర్ గైడెన్స్, స్కిల్ ఎడ్యుకేషన్, గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్, వాటి గురించి వీడియోలు ద్వారా తెలియజేయడం, జిఎఫ్ఎల్ఎన్ యాక్షన్ ప్లాన్, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ గురించి వివరించడం, ఎస్ఎస్సి రిజల్ట్స్, ప్రభుత్వ పథకాలు, ముఖ్యమైన కార్యక్రమాల గురించి తెలపడం, తదితర అంశాలు, కార్యక్రమాల గురించి తెలియజేయడం జరుగుతుంది. 10:50 నుంచి 11 గంటల వరకు టిఎఆర్ఎల్ కిట్, ఎస్ఆర్కెవిఎం కిట్, స్పోర్ట్స్ మెటీరియల్, చిల్డ్రన్ మెటీరియల్ అండ్ మదర్ యాక్టివిటీలు, ఫోటో గ్యాలరీ ఉంటుంది. 11 గంటల నుంచి 11:20 గంటల వరకు తల్లులకు రంగోలి/ లెమన్ ఠ స్పూన్ / మ్యూజికల్ చైర్స్, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహించడం జరుగుతుంది.ఉదయం 11:25 గంటల నుంచి 12:45 గంటల వరకు ఇన్విటేషన్, మా తెలుగు తల్లికి ప్రేయర్, పాఠశాల హెచ్ఎం స్కూల్ అకాడమిక్ ప్రోగ్రెస్ తెలపడం, తల్లికి వందనం గ్రూప్ డాన్స్, స్కూల్ టాపర్ స్పీచ్, లీప్ యాప్ ఠ టెస్టిమోనియల్ యాప్ ఉపయోగం గురించి తెలపడం, డ్రగ్స్ వద్దు బ్రో స్పీచ్, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్పర్సన్ స్పీచ్, డోనార్ యాప్ ఠ రిజిస్ట్రేషన్ ఆఫ్ వన్ డోనర్ లాంచ్, చీఫ్ గెస్ట్ మెసేజ్, విద్యార్థులకు క్వశ్చన్ అండ్ ఆన్సర్స్ సెషన్, వందన సమర్పణం నిర్వహించనున్నారు.అనంతరం మధ్యాహ్నం 12:45 గంటల నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనంలో అందరూ పాల్గొననున్నారు. దీంతో ఈ కార్యక్రమం ముగియనుంది.

## జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు



...... అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్య అధికారిగా కట్ట వెంకటేశ్వర్లు నేడు బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో అల్లూరు సామాజిక వైద్య శాలలో డిప్యూటీ సివిల్ సర్జన్ గా పనిచేస్తున్న డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పదోన్నతి పై అనంతపురం జిల్లా డి ఎం అండ్ హెచ్ ఓ గా బదిలీ పై వచ్చారు. అనంతపురం జిల్లా లోని ప్రజానీకం ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని దానికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకుని సామాన్య జనానికి అవసరమైన వైద్య ఆరోగ్య సేవలు సంపూర్ణంగా అందేందుకు శాయశక్తుల కృషి చేస్తానని ఆయన చెప్పారు. అదేవిధంగా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో అలసత్వం లేకుండా కృషి చేయాలన్నారు. ఐ వి ఆర్ ఎస్ లో సత్ఫలితాలు కనబడే విధంగా సేవలందించాలన్నారు. సిబ్బంది సమస్యలు పరిష్కారంలో తాను ముందుంటానని, అదేవిధంగా సిబ్బంది ప్రజలకు సహృదయంతో ఆరోగ్య సేవలందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది, సంఘ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

## బీఆర్ఎస్ "యువ సంగ్రామ సదస్సు" కు తరలి రండి



ఖమ్మం, వైరా, నేటి శుభోదయ ::: హైదరాబాద్ , సరూర్నగర్ స్టేడియంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు'విజయవంతం చేయాలి అని బిఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోతు మనిషా లక్ష్మీ మదన్ లాల్ కోరారు. యూత్ డిక్లరేషన్" పేరుతో విద్యార్థులు,నిరుద్యోగయువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసింది.యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, తమ హక్కుల సాధన కోసం యువత పెద్ద సంఖ్యలో యువ సంగ్రామ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని మానవత్వం బానోత్ మనిషా లక్ష్మి ప్రకటనలో పిలుపునిచ్చారు. వైరా నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, నిరుద్యోగ యువత ఒక్కటై తమ గొంతును వినిపించే వేదికగా ఈ సభ నిలవనుంది. వైరా నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొని సభను విజయవంతం చేయాలని అమె పిలుపునిచ్చారు.

## గరగలంపాలెంలో ఘనంగా నూతన చర్చికు శంకుస్థాపన..!

**– ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మహిళా హ్యూమన్ రైట్స్ చైర్మన్ ఖండవల్లి లక్ష్మి..**

**– నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం ప్రకటన ..!**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గరగలంపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న చర్చికి శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హ్యూమన్ రైట్స్ మహిళా చైర్మన్, తెలుగుదేశం పార్టీ ఎస్.సి.సెల్ రాష్ట్ర నాయకురాలు ఖండవల్లి లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, కమిటీ పెద్దలు, గ్రామస్తులు ఖండవల్లి లక్ష్మి ని శాలువలు, పూలమాలలుతో ఘనంగా సన్మానించారు. కాగా గ్రామంలో లక్ష్మి చర్చి నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవుని సేవ కోసం, గ్రామ అభివృద్ధి కోసం మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, క్రైస్తవ సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలు, క్రైస్తవ సంఘ సభ్యులు, యూత్ సబ్యులు ఖండవల్లి లక్ష్మి సేవలను అభినందించారు.

## యాడికిలో వైభవంగా అమ్మవారికి గోరింటాకు అలంకరణ



యాడికి జూలై 17 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :మండల కేంద్రంలోని స్థానిక శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాడమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారిని గోరింటాకుతో అత్యంత నయనమనోహరంగా అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచే ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అర్చకులు అమ్మవారికి సుప్రభాత సేవ, గంగపూజ,పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం 7 గంటలకు విశేష కుంకుమార్చన, మణిద్వీప వర్ణన, లలితా సహస్రనామావళి పఠనం ఘనంగా జరిగాయి. అనంతరం నిర్వహించిన రథోత్సవంలో మహిళలు భక్తి శ్రద్ధలతో కోలాటాలు ఆడుతూ, భక్తి గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తాదులందరికీ గంగవరం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.

## బీసీ కులగనన కై పార్లమెంట్ లో పోరాడుతా

**– బిఆర్ఎస్ పార్లమెంట్ పక్షనేత పదవినీ బీసీల కోసం ఉపయోగిస్తా**

**– టిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ పక్షనేత గా ఎన్నికైన తనను అభినందించిన బీసీ నేతలతో వద్దిరాజు రవిచంద్ర వెల్లడి**



హైదరాబాద్, నేటి శుభోదయ ::: బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ పక్షనేత గా తనకు అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని ఉపయోగించి పార్లమెంటులో బీసీ కుల గణన, బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పోరాడుతానని బిఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఇటీవల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కెసిఆర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రనురవిచంద్రను బిఆర్ఎస్ పార్లమెంట్ పక్ష నేతగా ఎంపిక చేసిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ఈరోజు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బిసి ప్రతినిధుల బృందం ఎంపీని శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ పక్ష నేత వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యులుగా రెండుసార్లు అవకాశం కల్పించి, ఈరోజు బిఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేతగా ఎంపిక చేసిన పార్టీ అధినేత కేసిఆర్ కు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు, పార్టీ ఇచ్చిన అవకాశాన్ని బీసీల కోసం ఆయుధంగా ఉపయోగించి దేశవ్యాప్తంగా ఉన్న బీసీ డిమాండ్ల సాధన కోసం పార్లమెంట్ లో గళం విప్పుతానని వద్దిరాజు హామీ ఇచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ సమస్యల పట్ల సంపూర్ణ అవగాహన ఉండి బిసి డిమాండ్ల పై గతంలో పార్లమెంట్ పోరాడిన చరిత్ర వద్దిరాజు రవిచంద్ర కి దక్కిందని, ఈరోజు టిఆర్ఎస్ పార్టీ పార్లమెంటు పక్ష నేతగా కేసీఆర్ ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్ననన్నారు. దేశవ్యాప్తంగా జాతి జనగణలో బీసీ కులగనన, బీసీలకు జనాభా దామాష్ ప్రకారం రిజర్వేషన్ల పెంపు, మహిళా బిల్లు బీసీ మహిళకు సబ్ కోట తదితర డిమాండ్ల పై బీసీ సంఘాలు పార్లమెంటు బయట చేస్తున్న పోరాటానికి , పార్లమెంటు లోపట బీసీ సామాజిక వర్గానికి చెందిన వద్దిరాజు రవిచంద్ర పోరాడుతారని విశ్వాసం తమకుందన్నారు. వద్దిరాజు దక్కిన పదవి బీసీలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ ముప్పు బిక్షపతి రజక, బీసీ సంఘాల నేతలు గూడూరు భాస్కర్ మేరు, జాజుల భాస్కర్, బండి గారి రాజు తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా పెద్దమ్మ తల్లికి 1008 కలశాల జలాభిషేకం

**యాడికిలో ఘనంగా పుట్టింటి సారె సమర్పణ యాడికి, జూలై 17 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :**



మండలంలోని మెయిన్ బజార్లో వెలసిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆషాడ మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని లోక కళ్యాణార్థం, సకాలంలో వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. యాడికి పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 4 గంటలకే మహిళలు భక్తిశ్రద్ధలతో 1008 కలశాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి ఆకులు, వేపమండలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అమ్మవారికి ఖడ్గమాల సమర్పించి మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం 4 గంటలకు శ్రీశ్రీశ్రీ లక్ష్మీ భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానం నుండి సాంప్రదాయం ప్రకారం వంద రకాల పిండి పదార్థాలు, స్వీట్లు, పూలు, పండ్లతో కూడిన పుట్టింటి సారెను తీసుకువచ్చారు. పాత పోలీస్ స్టేషన్, ఆర్యవైశ్య మెయిన్ బజార్ మీదుగా పెద్దమ్మ దేవస్థానం వరకు సాగిన ఈ శోభాయాత్రలో దాదాపు 300 మంది మహిళలు, పురుషులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులు సమర్పించిన సారెను స్వీకరించిన వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. శోభాయాత్ర పొడవునా భక్తులు చేసిన 'జై పెద్దమ్మ తల్లి.. జై జై పెద్దమ్మ తల్లి' నినాదాలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం మార్మోగింది.



## దుర్గాప్రసాద్ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్.

**బ్రాహ్మణ సోదరీ సోదరీమణులకు ముఖ్య విజ్ఞప్తి**



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్ )జులై 17 :బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ సభ్యత్వాలు తీసుకోవడం జరుగుతుంది మనకి ఈ సభ్యత్వాలు ఏమిటి అని అనే ఆలోచించవద్దు ఎందుకంటే ఈ సభ్యత్వం కేవలం 600 రూపాయలు సభ్యత్వం మరలా మనకి 500 రూపాయల షేర్ బాండ్ ఇవ్వటం జరుగుతుంది ఈ సభ్యత్వం వలన మన బ్రాహ్మణ కమ్యూనిటీని అభివృద్ధి పథంలోకి ముందుకు తీసుకుపోవటానికి మన సొసైటీని మనం బలోపేతం చేసుకోవటానికి చాలా అవసరం తద్వారా మన బ్రాహ్మణ కమ్యూనిటీకి, గ్రూపులోన్,గాని వ్యాపారాలు లోన్,హౌసింగ్ మార్టేజ్ లోన్, గాని మహిళలకు సంబంధించిన లోన్స్ గాని, ఇవ్వటం జరుగుతుంది ఈ సభ్యత్వం తీసుకోవటం వలన ఏదైనా సరే అనుకోని సంఘటన జరిగితే ఆ కుటుంబానికి ఇన్సూరెన్స్ ద్వారా ఒక 50,000 రూపాయలు ఆ కుటుంబానికి ఇవ్వటం జరుగుతుంది ఎవరైనా ఈ సభ్యత్వం తీసుకునేవారు ఆఫీసు నందు సంప్రదిస్తే ఆఫీస్ అడ్రస్ చివుకుల దుర్గాప్రసాద్ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ 6/1/29 భీమవారిపాలెం పార్కు వెనక భీమవారిపాలెం బాపట్ల 9866171296 సంప్రదించగలరు ఈ నెంబర్ షిప్పులు ప్రతి ఒక్క బ్రాహ్మణ సోదరులు కూడా తీసుకోవలసినదిగా కోరుచున్నాను.

## విజయవాడ ప్రెస్ క్లబ్ లో ముద్రగడ కి ఘన నివాళులు




17 జులై నేటి శుభోదయ: రిపోర్టర్ విజయవాడ. శుక్రవారం విజయవాడ గాంధీ నగర్ లో ఉన్న ప్రెస్ క్లబ్ లో ఇటీవల మరణించిన మాజీమంత్రి కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం కి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది . ఆయనతోపాటు కాపు కులంలో ఇంతకుముందు చనిపోయిన కాపు నాయకులకి అందరికీ నివాళులర్పించారు వంగవీటి మోహనరంగా పిల్లా వెంకటేశ్వరరావు బేతూ రాము మిరియాల వెంకటరావు కి నివాళులర్పించారు ఈ కార్యక్రమం నేషనల్ జస్టిస్ ఫ్రెండ్ అధ్యక్షుడు నారగోని అధ్యక్షతన జరిగింది ఆయన మాట్లాడుతూ కాపు కులంలో స్వతంత్రం రాకముందు నుంచి మద్రాస్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తులు ఉన్నారని. రిజర్వేషన్ కోసం పోరాడిన లో కాపులు ఉన్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్లో రెండు కులాలు మాత్రమే అధికారం పంచుకుంటున్నాయని మిగతా కాపు ఎస్సీ ఎస్టీ బీసీ వీళ్ళకి అధికారం రావట్లేదని కాపు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అందరూ కలిపి ఒక ఫ్రంట్ ఏర్పడి ముఖ్యమంత్రి పీఠం అధిరోహించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మరొక కాపు నాయకులు మాట్లాడారు సంకు తిరుమల నాయుడు మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ నాన్ కమ్మ నాన్ రెడ్డి అందరూ ఏకం కావాలని రాజ్యాధికారాన్ని పొందాలని పిలుపునిచ్చారు. అయ్యన్న వీరంకి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఇంకా జరగాలని ముందు ముందు ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. నాగినేని హనుమంతరావు మాట్లాడుతూ రాజ్యాధికారం పొందే హక్కు అన్ని కులాలకి ఉందని ముఖ్యంగా కాపులు ఇంతవరకు సీఎం అవ్వలేదని పేర్కొన్నారు. ఇంకొక స్పీకర్ బండారు వెంకటరమణ మాట్లాడుతూ కేవలం భూమి డబ్బు ఎవరికి ఉందో వాళ్లు మాత్రమే అధికారం పొందగలుగుతున్నారని అది రెండు కులాలకు మాత్రమే ఉందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో చింత పవన్ నాగ కుమార్ వీరంకి అయ్యన్న శివాజీ నాగినేని హనుమంతరావు జయ బాబు పసుపులేటి సాయిబాబు దాసు భాను సత్యనారాయణ పృథ్వి నాయుడు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం రుడా చైర్మన్ 'బొడ్డు' కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం..!!

**– ప్రజలు అర్జీలు నేరుగా తీసుకుంటున్న ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరికి..**

**–– టీడీపీ మండల అధ్యక్షులు దూది కాంతారావు**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి గేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ప్రతి శుక్రవారం రాజానగరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని, ప్రజలు, పార్టీ శ్రేణులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు దూది కాంతారావు అన్నారు. శుక్రవారం బొడ్డు కార్యాలయంలో గ్రీవెన్స్ చేపట్టారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కు ప్రత్యేక టీం ఏర్పాటు చేశారని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ప్రజలు తమ సమస్యల కొరకు, అలాగే అభివృద్ధి కోసం ఉపయోగించుకోవడానికి ఇది మంచి వేదిక అని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కాంతారావు కోరారు.

## క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు ఘన స్వాగతం



నేటి శుభోదయ 17 పల్నాడు జిల్లా నరసరావుపేట కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నరసరావుపేటకు విచ్చేసిన ఏపీ సీఎం చంద్రబాబు,కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌కు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాసనసభ్యులు రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో ముందుకు సాగుతున్న తీరు ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని పేర్కొన్నారు.క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం ద్వారా రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (మీవీజుం), యువ పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారులు, స్టార్టప్ సంస్థలకు బ్యాంకుల ద్వారా సులభంగా రుణాలు అందించడం వల్ల స్వయం ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని జీవీ ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందడం సంతోషకరమని అన్నారు. ఇంతటి భారీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అభినందించారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఎల్నీనో దృష్ట్యా వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించేలా అధికారులు కార్యాచరణ

- కూరగాయల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగు విస్తీర్ణాన్ని పెంచాలి

- ప్రతి ఏఈఓ కనీసం 50 ఎకరాల చొప్పున కూరగాయలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాల సాగుకు రైతులను ప్రోత్సహించాలి




ఖమ్మం, నేటి శుభోదయ ::: ప్రస్తుత సీజన్‌లో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖ తదితర అనుబంధ శాఖల అధికారులతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోందని, భూగర్భ జలాలు క్రమంగా తగ్గుతున్నాయని, చెరువుల్లో కూడా తగినంత నీటి నిల్వలు లేవని అన్నారు. ఈ పరిస్థితుల్లో అధిక నీటి అవసరమయ్యే వరి, పత్తి వంటి పంటల సాగును ప్రోత్సహించవద్దని, రైతులను పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే వరి సాగు విస్తీర్ణాన్ని కనీసం 25 శాతం మేర తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలు వేసేలా మండలాల వారీగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించా లని సూచించారు. ఈ లక్ష్యం సాధించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ఖమ్మం నగరానికి ప్రతిరోజూ అవసరమయ్యే కూరగాయల డిమాండ్ ఎంత ఉంది, ప్రస్తుతం ఏ ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్నాయి, జిల్లాలోని రైతుల ద్వారా ఆ అవసరాలను ఎంత మేర తీర్చవచ్చనే అంశాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. తక్కువ నీటి అవసరమున్న పంటల సాగును రైతులు చేపట్టేలా ప్రోత్సహించాలని తెలిపారు. కోతుల బెడద తక్కువగా ఉండే పంటలను గుర్తించి వాటి సాగుపై రైతులకు సూచనలు అందించాలని, అవసరమైన నాణ్యమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) తన పరిధిలో కనీసం 50 ఎకరాల్లో కూరగాయలు, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాల సాగుకు రైతులను ప్రోత్సహించి లక్ష్యాలను సాధించేందుకు కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.మండలాల వారీగా కాలువల క్రింద, బోరు బావుల క్రింద సాగు విస్తీర్ణం, భూగర్భ జలాల ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సమాచారాన్ని గ్రామస్థాయి వరకు రైతులకు చేరవేసి, నీటి లభ్యతను బట్టి ఏ పంటలు సాగు చేయాలో స్పష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు.సొంత బోరుబావి ఉన్న రైతులు కూడా సంవత్సరం మొత్తం సరిపడా నీటి లభ్యత ఉంటుందనే పూర్తి భరోసా ఉన్నప్పుడే వరి సాగు చేపట్టాలని, లేకపోతే మధ్యలో నీటి కొరత కారణంగా పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులకు వివరించాలని సూచించారు.జిల్లాలో ఎరువుల నిల్వలను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో, తగిన పరిమాణంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి కొరత తలెత్తకుండా నిరంతరం నిల్వలను సమీక్షిస్తూ, జిల్లాలోని ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, డిసిఓ గంగాధర్, ఉద్యానవన శాఖ అధికారి అనిత, మత్స్య, ఇతర వ్యవసాయ, ఉద్యానవన శాఖ డివిజన్, మండల అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్స్ కప్

### జిల్లా స్థాయి పోటీలకు విజన్ పాఠశాల విద్యార్థుల ఎంపిక



యాడికి, జులై 17 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్స్ కప్ - 2026 క్రీడా పోటీల్లో భాగంగా తాడిపత్రి నియోజకవర్గ స్థాయి ఎంపికలు ఘనంగా జరిగాయి. అరబిందో పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలలో యాడికి పట్టణానికి చెందిన విజన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వివిధ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన క్రీడాకారుల నుంచి గట్టి పోటీని ఎదుర్కొని ఈ పాఠశాల విద్యార్థులు జిల్లా జట్టులో స్థానం సంపాదించి తమ విద్యాసంస్థకు కీర్తిప్రతిష్టలు తీసుకువచ్చారు.పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు శ్రీరంగ, మణి కిషోర్ అండర్-17 కబడ్డీ విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికవగా, తొమ్మిదవ తరగతి విద్యార్థి ఎన్. శ్రీకర్ మరియు పదవ తరగతి విద్యార్థి ఎన్. వెంకట్ అండర్-17 యోగా విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికై తమ ప్రతిభను చాటుకున్నారు.ఊ విద్యార్థుల ఈ అద్భుత విజయం పట్ల విజన్ హై స్కూల్ కరెస్పాండెంట్ శ్రీ విశ్వనాథ్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందం సభ్యులు అమర్, శేఖర్, కోటి మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లా స్థాయికి ఎంపికవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లోనూ వీరు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికై, పాఠశాలకు మరియు యాడికి ప్రాంతానికి మరిన్ని విజయాలు అందించాలని పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆశీస్సులు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## కాలేజీ విద్యార్థులే టార్గెట్..

## గంజాయి 'మాస్టర్ మైండ్' బర్రి నాగరాజు అరెస్ట్..!!

- టాస్క్ ఫోర్స్ కన్నుగప్పి తిరుగుతున్న నిందితుడి ఆట కట్టించిన భీమిలి పోలీసులు...



( నేటి శుభోదయ జులై : 18 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) విద్యార్థులే లక్ష్యంగా.. యువతే పెట్టుబడిగా భీమిలి మండలంలో యథేచ్ఛగా సాగుతున్న గంజాయి దందాను భీమిలి పోలీసులు ఛేధించారు. ఇన్నాళ్లూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న గంజాయి అక్రమ రవాణా 'మాస్టర్ మైండ్' బర్రి నాగరాజును భీమిలి సీఐ దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలోని ప్రత్యేక పోలీస్ బృందం అత్యంత చాకచక్యంగా అదుపులోకి తీసుకుంది. ఈ ముఠాకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించారు.గతంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు జరిపిన దాడి నుంచి నిందితుడు బర్రి నాగరాజు తృటిలో తప్పించుకుని పరారయ్యాడు. అప్పటి నుంచి సంచరిస్తూ, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని భీమిలికి తరలిస్తున్నాడు. ఇక్కడి కొన్ని ప్రముఖ కళాశాలల విద్యార్థులను, మండలంలోని అమాయక యువతను టార్గెట్ చేస్తూ ఒక్కో గంజాయి ప్యాకెట్‌ను రూ.500 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు.భీమిలి సీఐగా బాధ్యతలు స్వీకరించిన కేవలం వారం రోజుల్లోనే సి.ఐ. దివాకర్ యాదవ్ డ్రగ్స్ నెట్‌వర్క్‌పై ప్రత్యేక నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన ఆయన టీమ్, ఎట్టకేలకు ఈ గంజాయి మాస్టర్ మైండ్‌ను పట్టుకోవడంలో సఫలమైంది. నిందితుడిని అరెస్ట్ చేసి, ఈరోజు కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించింది.ఈ సందర్భంగా భీమిలి పోలీసులు తల్లిదండ్రులకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. "పిల్లలు కేవలం కాలేజీలకు వెళ్తున్నారు, వస్తున్నారు అని సరిపెట్టుకోవద్దు. వారి రోజువారీ అలవాట్లు ఏంటి? వారు ఎలాంటి వారితో స్నేహం చేస్తున్నారు? అనే విషయాలపై ప్రతి తల్లిదండ్రులూ నిరంతరం నిఘా ఉంచాలి" అని కోరారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని, భవిష్యత్తులో మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని సీఐ దివాకర్ యాదవ్ హెచ్చరించారు..

## యువత పెడదోవ పట్టొద్దు అవగాహన సదస్సులో పోలీసుల పిలుపు




( నేటి శుభోదయ జులై : 18 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ?పెందుర్తి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చట్టాల ను గౌరవిస్తూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖతో కలిసి పని చేయాలని పెందుర్తి పోలీసులు పిలుపునిచ్చారు పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ సూచనల మేరకు అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ దేవరలు హెడ్ కానిస్టేబుల్ అప్పారావు ఆధ్వర్యంలో పొలగాని పాలెం జంక్షన్ వద్ద యువకులతో ముఖాముఖి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు ఈ సంద ర్భంగా సమాజంలో యువత ఎదుర్కొంటున్న పలు కీలక అంశాలపై పోలీసు అధి కారులు విస్తృతంగా అవ గాహన కల్పించారు వాటిలో ముఖ్యమైనవి మత్తు పదార్థాల అనర్థాలుగంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల జీవితాలు ఎలా నాశ నమవుతాయో వివరించారుమొబైల్ ఫోన్ దుష్ప్రభావాలుపిల్లలు,యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కావడం వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు.ర్యాగింగ్ మహమ్మారివిద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను పూర్తిగా అరికట్టాల్సిన అవ సరాన్ని దానివల్ల ఎదురయ్యే చట్టపరమైన చర్యలను హెచ్చరించారు.బహిరంగ వ్యసనాలపై నిఘాబహిరంగ ప్రదేశాల్లో ధూమ పానం,మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని అటు వంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.ఆన్‌లైన్ బెట్టింగ్‌ల నష్టాలుఈ మధ్యకాలంలో యువత ను పీడిస్తున్న ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్,గేమింగ్ వల్ల కలిగే ఆర్థిక, మానసిక నష్టాలను వివరించారు.సైబర్ నేరాలు అండ్ ట్రాఫిక్ నియమాలుసైబర్ నేరాల బారిన పడ కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియ మాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.అత్యవసర సేవలుఏదైనా ఆపద లేదా అత్య వసర పరిస్థితి వస్తే తక్షణ సహాయం కోసం 112 టోల్ ఫ్రీ నంబర్‌ను ఎలా విని యోగించుకోవాలో అవ గాహన కల్పించారు నిరుద్యోగ యువత బాధ్య తారాహిత్యంగా తిరగకుండా తమ భవిష్యత్తును సక్రమం గా తీర్చిదిద్దుకోవాలని ప్రతి పౌరుడు తన గ్రామం మరియు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని అధికారులు హితవు పలికారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న యువకులు పోలీసుల సూచనలను ఆసక్తిగా వినడంతో పాటు తమకున్న పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు సమాజంలో నేరాల నియంత్రణకు ఇలాంటి అవగాహన కార్య క్రమాలు ఎంతగానో ఉప యోగపడతాయని యువత పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ద్విచక్ర వాహనాల దొంగతనాల రాకెట్ ను ఛేదించిన కసింకోట పోలీస్..!!




( నేటి శుభోదయ జులై : 18 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) కసింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ సంవత్సరంలో నమోదైన రెండు ద్విచక్ర వాహనాల చోరీ కేసులను అత్యంత ప్రాధాన్యతతో తీసుకున్న జిల్లా పోలీసు ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయబడింది. దీనిలో భాగంగా అనకాపల్లి ఇన్చార్జ్ ఎస్ డీపీవో , జి .ఆర్ .ఆర్ .మోహన్ ఆద్వర్యం లో, కశింకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.స్వామి నాయుడు, ఎస్ఐ లక్ష్మణరావు, ఎస్ఐ సతీష్ మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఒక బృందాన్ని గోకవరం, రెండో బృందాన్ని రాజమండ్రి, మూడో బృందాన్ని జగ్గంపేట మరియు కోరుకొండ ప్రాంతాలకు పంపించి, విస్తృతంగా దర్యాప్తు చేపట్టారు.పోలీసుల సమన్వయంతో కూడిన మెరుపు చర్యల ఫలితంగా దొంగతనమునకు వస్తున్న ముగ్గురు నిందితులను మరియు ఇద్దరు సీఐసీల్ (మైనర్ బాలురు) లను ముందస్తు సమాచారం పై అత్యంత చాకచక్యంగా కశింకోట గ్రామ జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకొని, వారు ఇచ్చిన సమాచారం పై వారు దొంగలించిన మోటార్ సైకిల్ లను వారి గ్రామమైన గోకవరం మండలం డ్రైవరుల కాలనీ వద్ద దాచి ఉంచినట్లు ఇచ్చిన సమాచారం పై మొత్తం 17 ద్విచక్ర వాహనాలను (అనకాపల్లి జిల్లా కు చెందిన బైకులు- 14, విశాఖపట్నం కు చెందిన బైకు-01, విజయవాడ కు చెందిన బైకులు-02) స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సంబంధిత కేసుల వివరములు సేకరించి, నిందితులను శుక్రవారం గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించడం జరిగింది. ఆదేవిదంగా మైనర్ బాలురు జువెనైల్ హోమ్ కు అప్పగించడమైనది. ఈ కేసును వేగవంతంగా ఛేదించి, భారీ సంఖ్యలో చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకున్న కసింకోట పోలీసులైన సిఐ స్వామి నాయుడు,ఎస్ఐ లు కే .లక్ష్మణ రావు, బి .సతీష్, పోలీస్ సిబ్బంది అయిన హెచ్ సీ జి .మధుబాబు, కానిస్టేబుల్ లు అయిన డి .గోపి, జి .శ్రీనివాసరావు, ఎం .బాలకృష్ణ, ఎం .అప్పలరాజు, బి .మహేశ్వరరావు, వై .లక్ష్మణ్, ఎం .శ్రీను, హెచ్ జి కే .బ్రహ్మరాజు ల యొక్క పనితీరును జిల్లా ఎస్పి అనకాపల్లి ఇన్చార్జ్ ఎస్ డీపీవో ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో చూపిన చొరవ, నిబద్ధత, సమర్థతకు గుర్తింపుగా కసింకోట పోలీసు సిబ్బందిని ఘనంగా అభినందించి సన్మానించారు.నిందితుల వివరములు : 1) పాశంశెట్టి సాయికుమార్ ఏ సాయి లేట్ నాగేశ్వరరావు, 2) మర్రి రవితేజలి సూరిబాబు, 3) మర్రి దుర్గ బాబు పెద్దబ్బాయి మరియు సీఐసీల్ (ఇద్దరు మైనర్ బాలురు) (పై నిందితులు మరియు సీఐసీల్ (మైనర్ బాలురు )లు అందరూ కాకినాడ జిల్లా గోకవరం మండలం డ్రైవరుల కాలనీకు చెందినవారు)



## డ్రగ్స్ వద్దు -- చదువే ముద్దు":

- భీమిలిలో 800 మంది విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ



( నేటి శుభోదయ జులై : 18 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ?భీమిలి యువతను పట్టి పీడిస్తున్న మాదక ద్రవ్యాల భూతానికి వ్యతిరేకంగా భీమిలిలో విద్యార్థులు గళమెత్తారు. "శంఖభ్రత సంకల్పం -- డ్రగ్స్ వద్దు, చదువే ముద్దు" అనే పిలుపుతో నేడు (17-07-26) ఉదయం 11 గంటలకు భీమిలి ఎస్.హెచ్.ఓ.ఆధ్వర్యంలో ఒక భారీ అవగాహన ర్యాలీ ని అత్యంత విజయ వంతంగా నిర్వహించారు ?ఈ కార్యక్రమానికి సంబం ధించిన ముఖ్యాంశాలు 800 మందితో భారీ ప్రదర్శన స్థానిక కళాశాలలతో పాటు, డైట్ (డైట్ ) కళాశాల మరియు ఏ.ఎం.జి. (ఏ ఎం జి ) కళాశాలలకు చెందిన సుమారు 800 మంది విద్యార్థులు,ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో ఉత్సాహం గా పాల్గొన్నారు ?గంటస్తంభం నుండి బీచ్ వరకు "డ్రగ్స్ వద్దు -- చదువే ముద్దు" అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు మిన్నంటాయి. భీమిలి గంటస్తంభం వద్ద ప్రారంభమైన ఈ కాలినడక (ఫుట్) ర్యాలీ భీమిలి బీచ్ వరకు ఉధృతంగా సాగింది. ?ఎస్.హెచ్.ఓ. హితబోధ ర్యాలీ అనంతరం భీమిలి బీచ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ఎస్.హెచ్.ఓ. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు మాదక ద్రవ్యాల బారిన పడితే యువత భవిష్యత్తు, ఆరోగ్యం,చదువు ఎలా నాశనమవుతాయో ఆయన వివరించారు క్షణికానందం కోసం జీవితాలను ఫణంగా పెట్టవద్దని,డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ కేవలం చదువుపైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరో హించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## మరణించిన ఏఎస్ఐ కుటుంబానికి భద్రత

- ఎక్స్-గ్రేషియా చెక్కు అందజేసిన జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్



( నేటి శుభోదయ జులై : 18 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ, పోలాకి పోలీసు స్టేషన్ లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన పి. ఆదినారాయణ కుటుంబ సభ్యులకు రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి మంజూరైన భద్రత ఎక్స్-గ్రేషియా 3.96 లక్షల రూపాయలు నగదు చెక్కును శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగి కుటుంబ సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. విధి నిర్వహణలో ఉండగా మరణించినా లేదా ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయినా, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో భద్రత ఎక్స్-గ్రేషియా పథకం ద్వారాఈ సహాయం అందజేయబడుతుందని తెలిపారు.మరణించిన ఏఎస్ఐ కుటుంబ సభ్యులకు పోలీసు కుటుంబ సంక్షేమానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలన అధికారి సి హెచ్ గోపినాథ్ , మరణించిన ఏఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## యువత కలలను సాకారం చేయాలి..!!




( నేటి శుభోదయ జులై : 18 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) నాణ్యమైన విద్య, ఆరోగ్యం,నైపుణ్యాలు, ఉపాధి,సమాన అవకాశాలు,సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండడం, భద్రతతో కూడిన వాతావరణం, స్వేచ్ఛ, కుల -మత వివక్షత లేని ఆదర్శ సమాజం మొదలైనవి యువత కలలని, వాటిని సాకారం చేయవలసిన బాధ్యత నాయకుల పైన, అధ్యాపకుల పైన ఉందని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స కళాశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన విద్యార్థినుల అభినందన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ- ఇటీవల విశాఖ నగరంలో మానవ హక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో యువత కలల సాకారం అనే అంశంపై ప్రసంగించి, పలువురి ప్రశంసలు పొందిన సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు శ్రేయ,సాక్షి,అఫ్రీన్ లు అభినందనీయులని అన్నారు. వీరికి జాతీయ సేవా పథకం ద్వారా అవకాశాలను కల్పించిన జిల్లా నోడల్ అధికారి ఇపీఎస్ భాగ్యలక్ష్మిని, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయ దేవిని కూడా ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వేములపాడులో విలేజ్ లెవెల్ ప్రగతి కార్యక్రమాలను పరిశీలించిన యాడికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి



యాడికి, జులై 17 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామస్థాయి ప్రగతి అభివృద్ధి కార్యక్రమాలను యాడికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీరరాజు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను, ప్రభుత్వ పథకాల అమలు తీరును ఆయన కూలంకషంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బందితో మరియు స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై, ప్రగతి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా చూడాలని, విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల సమగ్ర రూపరేఖలను మార్చడమే ధ్యేయంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.

# ఐదేళ్లుగా ఆ పని నేనే చేసుకుంటున్నాను..
# ఒక్కసారి కూడా సెలూన్‌కు వెళ్లలేదు...



నటి శ్రుతి హాసన్ తన ఫ్యాషన్, జీవనశైలితో ఎప్పుడూ ప్రత్యేకంగా నిలుస్తారు. తాజాగా ఆమె తన జుట్టు సంరక్షణ గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచారు. గత ఐదేళ్లుగా తాను కనీసం హెయిర్ సెలూన్‌కు కూడా వెళ్లలేదని, తన జుట్టును తానే కత్తిరించుకోవడంతో పాటు అవసరమైన ట్రీట్‌మెంట్ కూడా ఇంట్లోనే చేసుకుంటానని వెల్లడించారు. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన శ్రుతి, 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు. మీ పొడవైన, నల్లని జుట్టు సౌందర్య రహస్యం ఏంటి? సెలూన్‌కు ఎంత తరచుగా వెళ్తారు? అని అడగ్గా, శ్రుతి ఏమాత్రం దాచుకోకుండా సమాధానమిచ్చారు. "నేను సెలూన్‌కు వెళ్లి దాదాపు ఐదేళ్లయింది. చివరిసారిగా 2017లో నా జుట్టుకు రంగు వేశాను. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి హెయిర్ కలర్ ఉపయోగించలేదు. నా జుట్టును నేనే కత్తిరించుకుంటాను, ట్రీట్‌మెంట్ కూడా నేనే చేసుకుంటాను" అని ఆమె స్పష్టం చేశారు. గ్లామర్ ప్రపంచంలో సెలబ్రిటీలు ఎప్పుడూ తమ బ్యూటీషియన్లు, హెయిర్ స్టైలిస్టులతో బిజీగా ఉంటారు. అలాంటిది 'సలార్' వంటి భారీ చిత్రాల్లో నటించిన శ్రుతి... ఏడేళ్లుగా హెయిర్ డైకి, ఐదేళ్లుగా సెలూన్‌కు దూరంగా ఉండటం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సమాధానం సోషల్ మీడియాలో వైరల్ అయింది. కొందరు అభిమానులు ఆమె నిజాయతీని మెచ్చుకోగా, మరికొందరు ఇంత బిజీగా ఉండి కూడా ప్రొఫెషనల్స్ సహాయం లేకుండా ఎలా మేనేజ్ చేస్తున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, శ్రుతి నిర్ణయం వెనుక కేవలం సౌలభ్యం మాత్రమే కాదు, ఒక బలమైన ఫిలాసఫీ కూడా ఉంది. ఆమె ఎప్పటినుంచో స్వీయ సంరక్షణ, మానసిక ఆరోగ్యం గురించి మాట్లాడుతూ ఉంటారు. తన ఫ్యాషన్, సంగీతం, ఫిట్‌నెస్ ఇలా ప్రతి విషయంలోనూ ఇతరుల ఆమోదం కన్నా తన సహజత్వానికే ప్రాధాన్యం ఇస్తారు. రసాయనాలతో కూడిన ట్రీట్‌మెంట్లు, సెలూన్లకు దూరంగా ఉండటం కూడా ఆమె జీవనశైలిలో భాగమే. సెలబ్రిటీల బ్యూటీ రొటీన్లు చాలా ఖరీదైనవి, సామాన్యులకు అందుబాటులో ఉండవనే అభిప్రాయం ఉంది. కానీ, శ్రుతి హాసన్ ఐదేళ్లుగా సెలూన్‌కు వెళ్లకుండానే అందమైన జుట్టును కాపాడుకోవడం ద్వారా ఒక కొత్త సందేశాన్ని ఇచ్చారు. మంచి జుట్టు కోసం ఖరీదైన ఉత్పత్తులు, నిపుణుల బృందం అవసరం లేదని, క్రమశిక్షణతో కూడిన సంరక్షణ ఉంటే చాలని ఆమె నిరూపించారు. గతంలో కూడా అభిమానుల కోసం తాను ఇంట్లో తయారుచేసుకునే హెయిర్ ఆయిల్ రెసిపీని ఆమె పంచుకున్న విషయం తెలిసిందే.







# వృషకర్మ రిలీజ్ డేట్..
# నాగచైతన్య అప్డేట్!

అక్కినేని అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. 'విరూపాక్ష' డైరెక్టర్ కార్తీక్ దండు దర్శకత్వంలో చైతన్య చేస్తున్న ఈ సినిమా టీజర్‌తోనే అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా ఈ సినిమా షూటింగ్ ఎంతవరకు వచ్చింది? ఎప్పుడు విడుదల కాబోతోంది? అనే విషయాలపై చైతన్య స్వయంగా క్లారిటీ ఇచ్చారు. సినిమా బడ్జెట్ నుంచి విలన్ వరకు అన్నీ ఆసక్తికరంగా ఉన్న ఈ ప్రాజెక్ట్ గురించిన మరిన్ని విశేషాలు చూద్దాం..

షూటింగ్ క్లైమాక్స్‌కు - చైతన్య ఖుషి: నాగచైతన్య తన కెరీర్‌లో ముందెన్నడూ చేయని ఒక విభిన్నమైన రోల్‌లో ఈ సినిమాలో కనిపించబోతున్నారు. తాజాగా మీడియా ఇంటరాక్షన్‌లో చైతూ మాట్లాడుతూ, సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుందని వెల్లడించారు. ఇక ఇప్పటికే 85 శాతం చిత్రీకరణ పూర్తయిందని, కేవలం 15 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఆ కొద్ది భాగాన్ని కూడా చకచకా పూర్తి చేసి, ఈ ఏడాది ద్వితీయార్థంలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. అవుట్‌పుట్ చూశాక చైతన్య ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉండటం విశేషం.

చైతూ కెరీర్‌లోనే భారీ బడ్జెట్: ఈ సినిమాను నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ ఏకంగా 120 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. నాగచైతన్య మార్కెట్ దృష్ట్యా ఇది చాలా పెద్ద రిస్క్ అయినప్పటికీ, కథ మీద ఉన్న నమ్మకంతో మేకర్స్ ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ఇక ఈ ప్యాన్-ఇండియా చిత్రానికి సుకుమార్ రైటింగ్స్ కూడా సహకారం అందిస్తుండటం సినిమాపై క్రేజ్‌ను డబుల్ చేసింది. 'వృషకర్మ'లో విజువల్స్ మరియు మిస్టరీ ఎలిమెంట్స్ హాలీవుడ్ స్థాయిలో ఉంటాయని ఇండస్ట్రీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

క్రేజీ కాస్టింగ్ - మీనాక్షి చౌదరి, స్పర్ష్ శ్రీవాస్తవ: సినిమాలో నాగచైతన్యకు జోడీగా టాలెంటెడ్ బ్యూటీ మీనాక్షి చౌదరి నటిస్తోంది. అయితే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోతున్నది ఎవరంటే లాపతా లేడీస్ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన స్పర్ష్ శ్రీవాస్తవ. ఈ సినిమాలో ఆయన విలన్ ఒక పవర్‌ఫుల్ రోల్‌లో మెరవబోతున్నారు. హీరో, విలన్ మధ్య జరిగే మైండ్ గేమ్స్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లు ఆడియన్స్‌ను థ్రిల్ చేస్తాయని తెలుస్తోంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం ఈ మిస్టికల్ అడ్వెంచర్‌కు ప్రాణం పోయనుంది.

**అక్కినేని ఫ్యాన్స్‌కు పండగే:**

చివరగా, 'వృషకర్మ' సినిమాతో నాగచైతన్య తన బాక్సాఫీస్ సత్తా చాటుతారని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు. కార్తీక్ దండు 'విరూపాక్ష'తో ఎలాగైతే థ్రిల్ చేశారో, అంతకు మించి ఈ సినిమాలో మ్యాజిక్ ఉండబోతోందని సమాచారం. ఇక షూటింగ్ పూర్తయిన వెంటనే గ్రాండ్ లెవల్‌లో ప్రమోషన్స్ ప్రారంభించి, విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నారు. 120 కోట్ల భారీ బడ్జెట్, మిస్టికల్ కథాంశం వెరసి ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద చైతన్యకు ఒక సాలిడ్ హిట్ దక్కుతుందని ఆశిద్దాం. విజువల్ పరంగా

# గ్లామర్ లోకంలో డాక్టర్ శ్రీలీల!



తెలుగు నటి శ్రీలీల డ్యాన్స్‌లు, నటనతోనే కాదు. చదువు పట్ల తనకున్నఅంకితభావంతోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఒకవైపు స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంటూనే మరోవైపు ఎంబీబీఎస్ కోర్సును విజయవంతంగా పూర్తి చేయడం హీరోయిన్లలో అరుదైన విషయం. నటిగా కొనసాగుతూ డాక్టర్ర లాంటి పెద్ద చదువును పూర్తి చేయడం అంటే ఆషామాషీ కాదు. రెండు రంగాలపై ఎంతో ఫ్యాషన్ ఉంటే తప్ప సాధ్యం కాదు. మరి వీటిని శ్రీలీల ఎలా బ్యాలెన్స్ చేస్తుంది? అంటే సినిమా షూటింగులు - మెడికల్ చదువులను మేనేజ్ చేయడం ఎలా సాధ్యమని అడిగితే ఆసక్తికర సమాధానం చెప్పింది. దీనికి అచంచలమైన సంకల్పం ఓపిక ఎంతో అవసరం. ఒక్కోసారి పరిస్థితులు క్లిష్టంగా మారతాయి. ఏమీ అర్థం కానట్టు అనిపిస్తుంది. అలాంటప్పుడు సహనంతో నిరణజ్ఞాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎంత ఇష్టమున్నా? ఒకేసారి రెండింటిలో కొనసాగి ఇబ్బంది పడటం అవసరమా? అనిపిస్తుంది. కానీ మనసు ప్రశాంతంగా ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటే ఏదైనా సాధించొచ్చు అంటుంది. వైద్య వృత్తిపై ఉన్న ఇష్టం, ఆ సబ్జెక్టుపై ఉన్న మక్కువ తనను ముందుకు నడిపించాయంది. పని ఒత్తిడిలో కూడా మనసును ఒక విషయం నుండి మరొక విషయానికి మార్చుకోగలగడం తన విజయ రహస్యంగా తెలిపింది. శ్రీలీల మామ్ కు, తాతయ్యకు ఇచ్చిన మాట కోసం ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి ఎంతో శ్రమించింది. షూటింగ్ బ్రేక్స్‌లో కారవాన్‌లో కూర్చుని చదువుకునేది. సెట్స్‌లో ఉన్నప్పుడు కూడా మెడికల్ పుస్తకాలను వెంట ఉంచుకో వడం అలవాటుగా మార్చుకుంది. ముంబైలోని డి.వై. పాటిల్ యూనివర్సిటీ నుండి ఇటీవల పట్టా పొందిన సమయంలో ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారంటే? ఆ డిగ్రీ వెనుక ఎంతటి కష్టం ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా తన తల్లి స్పెషలైజేషన్ అయిన గైనకాలజీలో ఆమె మంచి మార్కులు సాధించడం విశేషం. శ్రీలీల తల్లి స్వర్ణలత వృత్తిరీత్యా గైనకాలజిస్ట్. తల్లిని చూస్తూ పెరగడం వల్లే తనకు కూడా వైద్య వృత్తిపై గౌరవం ఏర్పడిందని శ్రీలీల చెబుతుంది. స్టార్ హీరోయిన్‌గా ఎంత బిజీగా ఉన్నా? తన ప్రాథమిక బాధ్యత చదువేనని ఆమె ఎప్పుడూ నమ్ముతుంది. సినిమా సెట్స్‌లో లైట్ల వెలుతురులో గడుపుతూనే, రాత్రిపూట దీపం వెలుగులో మెడికల్ టెక్స్ట్ బుక్స్‌తో కుస్తీ పట్టడం ఆమె దైనందిన జీవితంలో భాగమైపోయింది. ఒకే సమయంలో రెండు విభిన్నమైన కష్టతరమైన రంగాల్లో రాణించడం అనేది నేటి యువతకు ఒక గొప్ప స్ఫూర్తి. నటనపై ఫ్యాషన్ ఉన్నా? విద్యను నిర్లక్ష్యం చేయకుండా రెండు లక్ష్యాలను చేరుకోవచ్చని శ్రీలీల నిరూపించింది. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని ఆమె ప్రస్థానం చూస్తే అర్థమవుతుంది. గ్లామర్ రంగంలో ఉన్నవారికి చదువు అబ్బదు అనే పాతకాలపు ఆలోచనలను శ్రీలీల పటాపంచలు చేసింది. కేవలం అందం మాత్రమే కాదు. మెదడుకు కూడా పదును పెట్టాలని నిరూపించింది. రోగులకు సేవ చేస్తూనే, మరోవైపు ప్రేక్షకులను అలరించనుంది.

# బన్నీ ఫ్యాన్స్‌కు టెస్ట్ టైమ్..
# రాకా కోసం ఇంకా ఎంత వెయిట్?








ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ రాకా చుట్టూ తాజా బజ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. మొదట 2027 ఏప్రిల్‌లో రిలీజ్ కావాల్సిన ఈ సినిమా, ఇప్పుడు ఆ టైమ్‌లైన్‌ను మిస్ అయ్యే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా రిలీజ్ డిసెంబర్ 2027 లేదా సంక్రాంతి 2028కు షిఫ్ట్ అయ్యే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తోంది. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై రిలీజ్ వాయిదా వార్తలు ఫ్యాన్స్‌లో ఆసక్తితో పాటు కొంత ఆందోళనను కూడా పెంచుతున్నాయ్ 2027 ఏప్రిల్ వరకు రాకా షెడ్యూల్స్ ఈ ఊహాగానాలకు కారణంగా మారింది ముంబై షూటింగ్ నుంచి బయటకు వచ్చిన ఓ చిన్న క్లూ. చిత్ర యూనిట్ ఉపయోగిస్తున్న ఐడెంటిటీ ట్యాగ్‌పై ఉన్న వివరాల ప్రకారం, షూటింగ్ షెడ్యూల్ ఏప్రిల్ 2027 వరకూ కొనసాగవచ్చని సంకేతాలు కనిపించాయి. సాధారణంగా పెద్ద సినిమాలకు లాంగ్ షెడ్యూల్స్ ఉండటం కొత్త విషయం కాదు. కానీ రాకా విషయంలో ఈ స్థాయి లాంగ్ షూటింగ్ ఎందుకు అవసరమైంది అన్న ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ అట్లీ తన స్టైల్‌కు తగ్గట్టుగా ప్రతి సీన్‌ను గ్రాండియర్‌గా ప్లాన్ చేస్తున్నారనే టాక్ ఉంది. రాకా హాలీవుడ్ టెక్నీషియన్స్ కూడా ఇక ఈ ఆలస్యానికి మరో కీలక కారణంగా చెప్పబడుతున్నది భారీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్. ఈ సినిమా కోసం హాలీవుడ్‌కు చెందిన పలువురు టెక్నీషియన్స్ కూడా వర్క్ చేస్తున్నారు. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టిన ఈ సినిమా, పోస్ట్ ప్రొడక్షన్‌కే ఎనిమిది నెలల కంటే ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉందని ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. ఇదే నిజమైతే, రాకా కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫ్యాన్స్ మిక్స్డ్ రియాక్షన్స్ అయితే ఈ భారీ స్కేల్ ఒకవైపు హైప్‌ను పెంచుతుండగా, మరోవైపు వెయిటింగ్ టైమ్ కూడా పెరుగుతోంది. కాగా ఈ విషయంలో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ రియాక్షన్ మిక్స్‌డ్‌గా ఉంది. మంచి క్వాలిటీ కోసం ఎంతైనా వెయిట్ చేస్తామని ఓ వర్గం చెబుతుండగా, ఇంకా ఎంత కాలం వెయిట్ చేయాలంటూ మరో వర్గం ప్రశ్నిస్తోంది. అల్లు అర్జున్ ఫ్యాన్ బేస్‌లో మాత్రం ఈ ప్రాజెక్ట్‌పై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతూనే ఉంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న రాకా గ్లోబల్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తోందని స్పష్టమవుతోంది. అందుకే మేకర్స్ రిలీజ్ టైమింగ్ విషయంలో కూడా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. సంక్రాంతి 2028 సీజన్‌ను టార్గెట్ చేస్తే, భారీ బాక్సాఫీస్ రన్ సాధించే అవకాశం ఉంటుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో, ఇతర స్టార్ సినిమాలతో క్లాష్ ఎలా ఉంటుందన్నది కూడా ఆసక్తికర అంశంగా మారింది. మొత్తానికి, భారీ అంచనాలు, విస్తృతమైన నిర్మాణ ప్రక్రియ, హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వర్క్ అన్నీ కలిపి రాకాను ఒక లాంగ్ గెస్టేషన్ ప్రాజెక్ట్‌గా మార్చుతున్నాయి.

# త్రిష కృష్ణన్ 100 కోట్ల సామ్రాజ్యం
# 25 ఏళ్ల సినీ ప్రస్థానంలో అరుదైన మైలురాయి!



దక్షిణాది సినీ పరిశ్రమలో -ఎవర్ గ్రీన్ క్వీన్-గా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ తన 25 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో కేవలం నటిగానే కాకుండా ఒక బ్రాండ్‌గా ఎదిగారు. ప్రస్తుతం త్రిష నికర ఆస్తి విలువ సుమారు 100 కోట్ల రూపాయలకు చేరుకోవడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 1999లో -జోడి- చిత్రంతో సహాయ నటిగా ప్రయాణం మొదలుపెట్టిన త్రిష.. నేటికీ అగ్ర కథానాయికగా కొనసాగుతూ తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. ఒక నటిగా ఇన్ని దశాబ్దాల పాటు తన క్రేజ్‌ను కాపాడుకుంటూ ఆర్థికంగా ఇంతటి ఉన్నత స్థితికి చేరుకోవడం ఆమె పట్టుదలకు నిదర్శనం.

త్రిష ఆదాయ వనరులను పరిశీలిస్తే.. ఒక్కో సినిమాకు సుమారు 3 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. -పొన్నియిన్ సెల్వన్- వంటి భారీ విజయాల తర్వాత డిమాండ్ మరింత పెరిగింది. సినిమాలతో పాటు కార్పొరేట్ సంస్థల ప్రకటనల ద్వారా కూడా ఆమె భారీగానే ఆర్జిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. స్థిరమైన ఆదాయాన్ని గడించారు. ఈ సంపాదనను తెలివిగా వివిధ రంగాల్లో పెట్టుబడిగా మలిచారు. త్రిష ఆస్తిపాస్తుల్లో ప్రధానమైనవి హైదరాబాద్ - చెన్నైలలోని విలాసవంతమైన నివాసాలు. ముఖ్యంగా చెన్నైలోని ఆమె సొంత ఇల్లు అత్యంత ఖరీదైన ఇంటీరియర్స్‌తో సకల సౌకర్యాలతో కూడి ఉంది. దీని విలువ దాదాపు 10 కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా. ఇవే కాకుండా.. రియల్ ఎస్టేట్ రంగంలో కూడా భారీగా పెట్టుబడులు ఉన్నాయి. పలు నగరాల్లో విలువైన భూములు - వాణిజ్య సముదాయాల్లో భాగస్వామ్యం ఉండటం త్రిష ఆర్థిక భవిష్యత్తుకు మరింత భరోసాగా నిలిచాయి. విలాసవంతమైన జీవనశైలికి మారుపేరైన త్రిషకు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. గ్యారేజీలో బిఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, రేంజ్ రోవర్ వంటి ఖరీదైన కార్లు ఉన్నాయి. కేవలం భౌతిక సంపాదనే కాకుండా..జంతు సంరక్షణ .. పలు సేవా కార్యక్రమాల కోసం తన సంపాదనలో కొంత భాగాన్ని వెచ్చిస్తూ సమాజం విషయంలో తన బాధ్యతను చాటుకుంటున్నారు. త్రిష లైఫ్ స్టైల్ నేటి తరం యువ నటీమణులకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తోంది. వృత్తిపరమైన ఒడిదుడుకులు ఎదురైనా.. వ్యక్తిగత జీవితంలో ఎన్ని విమర్శలు వచ్చినా కుంగిపోకుండా తన కెరీర్‌ను విజయవంతంగా మలుచుకున్న త్రిష ప్రయాణం స్ఫూర్తిదాయకం. 40 ఏళ్ల వయసులోనూ కుర్ర హీరోయిన్లకు పోటీనిస్తూ..మరోవైపు వంద కోట్ల ఆస్తిని కూడబెట్టడం చూస్తుటే.. త్రిష వృత్తి గతంగా చూపే అంకితభావానికి ప్రతిఫలం.



EDITOR, Printed, Published and Owned by KOTLAPALLI FOUZIYAPrinted at Mis FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,SREEKANTAPURAM,HINDUPUR,SRI SATYA SAI,ANANTHAUR,ANDHPRADESH-515201.Cell7668886666Printing Press: FOUZIYAPUBLICATIONS,H.NO:5-1-2/14-1,LAKSHMIPURAM,HINDUPUR,SRI SATYASAI,ANAN THAUR, ANDHPRADESH- 515201.RNI Regd No APTEL/26/A0016